# సమర్థ సద్గురు

ఆధ్యాత్మిక మాసపత్రిక

అక్టోబర్ 2023

వెల : రూ.10.00



# శ్రీ మాతాజీవారి ఐరోపా పర్యటనలో ఆగష్టు 10 నుండి 13 వరకు రీడింగ్‌లో శ్రీ రామకృష్ణ గారి గృహమున జరిగిన త్రయాహ్నిక దీక్షా దృశ్యములు



లండన్ విమానాశ్రయములో
ఐరోపా బాబు
భక్త సమాజ్ వారితో



త్రయాహ్నిక
దీక్షా ప్రారంభము



సత్సంగము



పాద పూజ

# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా
ఫోన్ (0863) 2293645, 2293206.
web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

**సంపాదక వర్గము**
మిస్. పి. ఇందిరాదేవి
డా॥ యమ్. స్వర్ణముఖి
సి.వి. రమణ బాబు
పి.యస్.ఆర్.కె. ప్రసాద్
కె. మురళీ మోహన వర్మ

సంపుటి 43 సంచిక 2
పేజీలు 44
అక్టోబర్ 2023

5సం॥ల చందా రూ. 500
2సం॥ల చందా రూ. 240
సంవత్సర చందా రూ. 120
విడిప్రతి వెల...... రూ. 10

**బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ , A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి. M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా**
**మేనేజరు**
**సమర్థ సద్గురు మాగజైన్**
**శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు**
**గుంటూరు జిల్లా**

Printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor PALURI SIVA RAMA KALI PRASAD

**ఈ సంచికలో ............................. ....... పేజీ**

దాశరథీ శతకము ............................ ..........4
శ్రీబాబూజీ ఉవాచ.......................................... 5
అమ్మమాట.................................... ............ 7
బ్రహ్మ జిజ్ఞాస ................ ....................... ......... 9
పరిప్రశ్నేన సేవయా ... ............ ..............10
భగవంతుడిని శీఘ్రంగా ప్రసన్నం చేసుకోవడం ఎలా? .................11
అహింస ..................... ..................................... 14
వాంఛితార్థ ప్రదాయిని ...............................16
గాయత్రి మంత్రం .........................................17
గురు కృపాహి కేవలమ్ ..........................19
ఆశకి బానిస ..................................................20
దివ్యదర్శనం ........... ................. .................. 21
గురోరన్నం న భావయేత్............ ...............25
నారద భక్తి సూత్రాలు .................. ..............27
శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు ......................29
మనశ్శతకము ...................................................30
నిరీక్షణ ..............................................................31
ఈశావాస్యోపనిషత్ ..........................................33
అహల్యాబాయి హొల్కరు ................. ...35
సాధుమహాత్ముల సమాగమం ...............37
సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....38
విష్ణు కథలు ...... ............................ ....................40

## **దాశరథీ శతకము** - భద్రాచల రామదాసు

**39)** **విన్నపమాలకించు రఘువీర నహి ప్రతిలోకమందు నా**
**కన్న దురాత్ముడున్, బరమ కారుణికోత్తమ వేల్పులందు నీ**
**కన్న మహాత్ముడుం బతిత కల్మషదూరుడు లేడు నాకు, వి**
**ద్వన్నుత నీవె నాకు గతి దాశరథీ! కరుణాపయోనిధీ!**

భావం - నాకన్న దురాత్ముడు ప్రపంచమున లేడు. నీకన్న మహాత్ముడు దేవతలలో లేడు. కావున నాకు నీవే దిక్కు మరియొకరు కాదు దాశరథీ! కరుణా పయోనిధీ!



*ఒకేపని చేసిన రెండు సందర్భాలలో ఒకదానికి సత్కారం, మరొకదానికి శిక్ష ఎందుకు లభిస్తుంది?
*సగుణ భక్తి గొప్పదా? నిర్గుణ భక్తి గొప్పదా?
*జాలరి మొదటి చేపను ఏమి చేసేవాడు?
*దేహం దేవాలయం ఎప్పుడు అవుతుంది?
*డబ్బులిచ్చే బొమ్మ లక్కయ్యకు ఏమి నేర్పింది?
*పవన్ ఒంట్లో నీరు ఎలా పోయింది?
*ఏ అనుబంధం బంధవిముక్తిని కలిగిస్తుంది?
*ప్రకృతికి, ప్రపంచానికి తేడా ఏమిటి?
*కొద్దిగా చేయించిన ప్రసాదం అశేష భక్త జనులకు ఎలా సరిపోయింది?
*దేశంలోని ప్రధాన ఆలయాలను పునర్నిర్మించిన తల్లి ఎవరు?

***సమాధానాలు లోపలి పేజీలలో ..........................***

# శ్రీ బాబూజీ ఉవాచ - కీ.శే. పరాశర ప్రసాద్

3-9-1981

ఈరోజు ఉదయం శ్రీ బాబూజీ వాకింగ్‌చేస్తూ పవన్‌ని చూసి "కొంచెము మొహము, కాళ్ళు ఉబ్బుగా ఉన్నాయి బాగా నీరు ఉంది" అని పవన్‌కి ఆపిల్ ఇచ్చారు. మేము వాకింగ్ చేస్తున్నాము. పవన్ ఆపిల్‌కాయతో ఆడుకుంటూ, మధ్య మధ్య మాతో తిరుగుతున్నాడు. వెంకటరత్నంగారిని భక్తుల చరిత్ర చదవమన్నారు. ఆయన చదువుతుండగా, మధ్యలో శ్రీ బాబూజీ కలగజేసుకొని ఆ వాక్యం మళ్ళీ చదువు అన్నారు. ఈషణత్రయాన్ని జయిస్తేనే సంసార సాగరాన్ని దాటగల్గుతాము అని చదివారు రత్నంగారు. శ్రీ బాబు దానిని రెండుసార్లు చదివించారు. వెంటనే ఆ వాక్యంలో ఉన్న విషయం ఎంత ముఖ్యమో మాకందరికి అర్థం అయింది.



ఇంతలో పవన్ చేతిలో ఉన్న ఆపిల్‌కాయ క్రిందపడి పగిలిపోయింది. వెంకటరత్నంగారు 'ఆపిల్‌కాయ క్రిందపడవేయకురా, అది ప్రసాదం' అని పవన్‌ని హెచ్చరించారు.

శ్రీ బాబూజీ ఆ పండుని తీసుకుని అక్కడనే ఉన్న వాష్‌బేసిన్‌లో కడిగి వెంకటరత్నంగారికి యిచ్చి, "ఇది తింటూ చదవవయ్యా" అన్నారు.

పవన్ ఏడవటం మొదలుపెట్టాడు.

ఇంతలో డాక్టరు రామచంద్రరాజుగారి భార్య ఛాయ పవన్‌ని ఎత్తుకుని ఊరడించ ప్రయత్నించింది.

శ్రీ బాబూజీ కలగజేసుకుని, "మీకు ఎవ్వరికీ అసలు బుద్ధిలేదు. ఇక్కడ జరుగుతున్నది ఏమిటి? మీరు చేసేది ఏమిటి? ఇంతమాత్రం మనస్సుని ఏకాగ్ర దృష్టిలో ఉంచలేనివారు మీరు ఏమి సాధిస్తారయ్యా?" అని వెంకటరత్నంగారి వంక చూసి, "నీ పని నువ్వు చెయ్యవయ్యా!" అన్నారు. పవన్ ఏడుస్తూనే ఉన్నాడు. శ్రీ బాబూజీ పవన్ వంక చూసి, "ఎందుకురా

ఏడుస్తున్నావు నీ ఒంట్లో నీరంతా పోతుందిరా" అన్నారు.

ఈ జరిగిన సంఘటన ద్వారా, పవన్‌కి ఉపకారమే జరిగింది. పవన్‌కి మూత్రకోశ సంబంధ వ్యాధి ఉంది. కాబట్టి కొంత నీరు ఏడుపు ద్వారా పోవటానికా అన్నట్లుగా ఉంది.

---

## శివార్పణం

తమిళనాడు దగ్గర సముద్ర తీరంలో నాగపట్నం అనే ఊరు ఉన్నది. అక్కడ జాలరి కుటుంబాలు చాలా వున్నాయి. ఆ కుటుంబాలలో ఒక జాలరి మహా శివభక్తుడు. ఆ జాలరి పేరుమీదుగా ఇప్పటికీ నాగపట్నంలో ఒక ఉత్సవం చేస్తారు. ఈ జాలరి దినచర్య చేపలు పట్టడం. అందరూ కలిసి వెళ్ళి చేపలు పట్టేవారు. మొదటి చేపని శివార్పణం అంటూ సముద్రంలో పడవేసేవాడు అది ఈయనకు అలవాటు. మిగిలినవన్నీ తాను తీసుకునే వాడు. ఇప్పుడు మనం దుకాణాలలో చూస్తూ వుంటాం. మొదటి ఇడ్లీ భగవంతుడి దగ్గర పెట్టి, మిగిలిన ఇడ్లీలు జనాలకు పెడుతూ వుంటారు. కొందరు వ్యాపారం లాగా చేస్తారు. ఇతను భక్తిగా చేసేవాడు. ఇతని బ్రతుకులో తెలిసినదంతా శివార్పణం.

నిజానికి భక్తి అంటేనే శివార్పణం. శివార్పణం అని మనసారా అనగలిగితే ఆ మాట చాలు ఆనందింప జేస్తుంది.

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా ఈ క్రింది మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

***అక్టోబర్ 2023 :*** AS 1144, 5784, 7897, 7905, 7911, 7912, 8907, 8908, 8911, 9138 - 9141, 9143, 9144, 9180; LM 4391, 4396

***నవంబర్ 2023 :*** AS 4324, 7450, 7926, 7932 - 7934, 7936 - 7941, 7943, 7944, 7951, 7956, 8485, 9176; LM 4393

# అమ్మ మాట

- జపమాలా ప్రసాద

ఒకే గురుపాదాన్ని ఆశ్రయించండి. ఎవరు సమర్థులో, వారిని ఆశ్రయించండి. “స్వయం తీర్ణాః – పరాం తారయంతి” అన్నారు. తాను స్వయంగా తరించినవారే, ఇతరులను తరింపజేయగలరు.

గురుతత్వం అనేది ఒక రూపంతో ముడిపడి లేదు. అర్జునుడు స్వామియొక్క విశ్వరూపాన్ని దర్శించినప్పుడు అతడు కూడా ఆ విశ్వరూపంలోనే వున్నాడు. ఇక్కడున్న ప్రతివారూ కూడా ఏదో ఒక దేవుడ్ని ఆశ్రయించే వున్నారు. మీరు నమ్మిన దేవుడు అనంతుడని నమ్మండి. ఆ అనంతత్వంలో మీరూ వున్నారు. మనం నమ్మిన దేవుడిలో మనం వున్నాం. మనలో దేవుడు వున్నాడని గుర్తించండి. ఈ దేహంతో వుండగానే ఆ భగవత్తత్వాన్ని తెలుసుకుంటే జన్మ సార్థకమవుతుంది. ఈ రోజు యిక్కడ సత్సంగానికి రాకుండా వుండి వుంటే, మీరందరూ ఏ ఇంటిపనులలోనో, వంటలోనో, టి.వి.ల్లోనో మునిగిపోయి వుండి వుండేవారు. కానీ, యిక్కడికి రావడం వలన కాలాన్ని సద్వినియోగ పరచుకోవడమైనది.



కేవలం పుస్తకాలు చదవడం వలన మనకి జ్ఞానమొచ్చేస్తుందా అంటే, రాదు. కానీ మనలో వున్నదానిని మనం గుర్తించడానికి పుస్తకాలు సహాయం చేస్తాయి. అద్దైనా, చదివినది మనం ఆచరించినప్పుడు మాత్రమే. చదువు లేకపోయినా సంస్కారం, సేవాశ్రక్తి ఉంటే చాలు. రెండు దళాలు కోసి ‘ఇవి స్వామి సేవకు వినియోగించుకోండి’ అని యిచ్చినా, అది సేవే అవుతుంది. అలాగే ఎక్కడయినా చెత్త పడివుంటే, దానిని తీసి శుభ్రంచేస్తే అదీ సేవే అవుతుంది. ఆకలి గొన్నవాడికి అన్నం పెట్టడం, బాధలో వున్నవారిని ఓదార్చి వారికి వైద్యం చేయడం, ఇవన్నీ సేవలే. ఇంద్రియనిగ్రహం కలిగివుండి, నిరంతర భగవన్నామ స్మరణతో చేసిన ఏ పనైనా కూడా అది భగవత్కైంకర్యమే అవుతుంది. అలాగని దొంగతనం కూడా చేయవచ్చా అని మీరడగవచ్చు. ఇంద్రియ నిగ్రహం కలిగి, నిరంతర దైవ చింతనలో వున్నవాడు తప్పు ఎలా చేయగలడు?

ఈ గుడి ఏదో కొంతమంది కలిసి కట్టింది – కానీ, మన దేహమనే ఆలయాన్ని, దేవుడొక్కడే స్వయంగా కట్టి యిచ్చాడు. కనుక ఈ దేహముండగానే సాధన చేసి, దాని

లోపలనున్న నిజతత్త్వాన్ని తెలుసుకుంటే ఈ దేహమే దేవాలయము, జీవుడే సదాశివుడు అని తెలుసుకోగలుగుతాము. సదా ఆనంద స్వరూపులమై ప్రకాశిస్తాము. అప్పుడే దేహం చెందే మార్పులకి గాని, ఎటువంటి సుఖదుఃఖాలకి గాని మనం చలించం. కేవలం శాస్త్ర జ్ఞానం మనని తరింపజేయలేదు. "నీకు గ్రంథాలలో భగవత్తత్త్వం దొరికితే, ఇసుక దిబ్బలో పడ్డ సూది నాకు దొరకదా తాతా!" అని అడిగిన తాత మనుమరాళ్ళ కథ మనకు తెలిసినదే. అందుకే, శ్రీ ఆదిశంకర భగవత్పాదులవారు యీ విధంగా శెలవిచ్చారు

"అవిజ్ఞాతే పరే తత్త్వే శాస్త్రాధీతిస్తు నిష్ఫలాః ।
విజ్ఞాతేఽపి పరే తత్త్వే శాస్త్రాధీతిస్తు నిష్ఫలాః ॥

ఆ పరతత్త్వం తెలుసుకోకుండా, ఎన్ని శాస్త్రాలు చదివినా నిష్ఫలమే – పరతత్త్వం తెలుసుకున్నాక ఇక శాస్త్రాలెందుకు?

కనుక, సద్గురు దేవులనాశ్రయించి వారిచ్చిన లక్ష్యార్థ సాధన సక్రమంగా చేసి, నిజతత్త్వాన్ని, సత్యాన్ని తెలుసుకుని సర్వులూ ఆనందస్వరూపులై వర్ధిల్లుదురు గాక! గురుపాదుకలు సర్వులను కాపాడుగాక!!



## శ్రద్ధాంజలి

శ్రీబాబు చిరకాల భక్తులు, ఆశ్రమ నివాసులు అయిన మైలవరపు జానకిరామ శాస్త్రిగారు 12-9-2023 మంగళవారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 77 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియ జేస్తున్నాము.

## బ్రహ్మ జిజ్ఞాస

-ఎన్. కుట్టీ

మానవుడు తరించాలంటే భగవంతుణ్ణి పొందాలనే తీవ్ర తపన ఉండాలి. సాధన చతుష్టయంలో ముముక్షుత్వం నాల్గవది. మొదటి మూడు నిత్యానిత్య వస్తు వివేకము, ఇహాముత్రార్థ ఫలభోగ విరాగము, శమదమాది షట్క సంపత్తి. ముందుగా ఏది నిత్యము, ఏది అనిత్యము? అని విచారణ చెయ్యాలి. అప్పుడు ఈ ప్రపంచము అనిత్యము, బ్రహ్మ ఒక్కటే సత్యము అని గ్రహించగల్గుతాం. లౌకిక విషయాలు తెలిసికొనే విద్య అపరావిద్య. జ్ఞానాన్ని పొందే విద్య పరావిద్య. అపరా విద్య అంటే షడంగాలు శాస్త్రాలు, వేద పఠనము చేయుటము, యజ్ఞాదులు చేయటం వంటివి. వీటివల్ల పుణ్యం రావచ్చు, కీర్తి ప్రతిష్ఠలు రావచ్చు కాని మోక్షం రాదు. చేసిన పుణ్యం వల్ల స్వర్గ భోగాలు లభించవచ్చు. **"క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి"** పుణ్యం అనుభవించిన తరువాత తిరిగి భూలోకానికి రాక తప్పదు. అందుకనే పరావిద్యను సాధించమని ఉపనిషత్తులు ఘోషిస్తున్నాయి.

ఈశ్వరుడన్నా, ఆత్మ అన్నా, గురువన్నా ఒకటే. విశ్వమంతా నిండి ఉన్నది బ్రహ్మమే. సృష్టి, స్థితి, లయ కారకుడు బ్రహ్మమే. సూర్య చంద్రాదులకు వెలుగునిచ్చేది బ్రహ్మమే. **"ఆనందో బ్రహ్మ విజానాతి"** ఆనందమే బ్రహ్మ అని చెబుతోంది తైత్తిరీయం. ఈ జనన మరణాల విషవలయం నుండి దాటటమే ముక్తి. సత్య గురువుల సమాశ్రయం చేస్తే వారు జ్ఞాన మార్గాన్ని బోధిస్తారు. ఆ జ్ఞానం వల్ల ఈ కనిపంచే ప్రపంచమంతా అశాశ్వతము, శాశ్వతమైనది బ్రహ్మ ఒక్కటేననే నిశ్చయజ్ఞానం కలుగుతుంది. ఇంద్రియ సంయమనం వలన మనస్సుని విషయాదుల నుండి మరల్చి, ఆత్మ వైపు తిప్పాలి. విషయ రహితమైన మనస్సు ఆత్మలో లయిస్తుంది. అదే ముక్తస్థితి.

"ఆత్మ అవినాశి. జనన మరణాలకతీతమైనది, నామ గోత్రాలు లేనిది, అది స్త్రీ కాదు, పురుషుడు కాదు, నపుంసకుడూ కాదు. దానికి ఏ ఆకార వికారాలు లేవు. దానికి తత్త్వం లేదు. సహజ సమరసమైనది. అట్టివాడైన సద్గురునికి నమస్కరిస్తున్నాను" అని శ్రీ గురుగీత చెబుతోంది. సద్గురువులను సేవించి వారి కృపవల్ల తీవ్ర సాధన చేసి ఆ బ్రహ్మ పదాన్ని పొందవచ్చు. అదే మానవ గమ్యం, జీవిత పరమార్థం.

## పరిప్రశ్నేన సేవయా - కీ.శే. పరాశర ప్రసాద్

సగుణ భక్తి గొప్పదా? నిర్గుణ భక్తి గొప్పదా? అని లేవనెత్తిన ఒక భక్తుని ప్రశ్నకు సమాధానంగా సద్గురుమూర్తి అందించిన దివ్య సందేశము - "భక్తి సగుణమైనదే. విశ్వాసము నిర్గుణమైనది. సాధకుడు ఎవరైనా ముందుగా ఒక పూజా మందిరాన్ని ఏర్పరచుకుని పూజ, అలంకరణ, అర్చన అలవరచుకుంటాడు కదా! అది భక్తిని పెంపొందింప జేస్తుంది.

ధ్యానము సగుణమైనదే. ధ్యానము ద్వారా పొందే అనుభూతులన్నీ మనస్సు ద్వారా పొందేవే కాబట్టి అవన్నీ సగుణమైనవే. వేదాంత గ్రంథాలు, పురాణాలు, భక్తుల చరిత్రలు చదివి, భక్తిని పెంపొందించుకోవచ్చు. సంకీర్తనలో పాల్గొన వచ్చును. నామస్మరణ చేయవచ్చు. పురాణశ్రవణం చేయవచ్చు. ఇవన్నీ ఎన్ని చేసినా సద్గురుమూర్తి ఆశ్రయం లభించనిదే భక్తిగాని, విశ్వాసంగాని బీజదశలోనే ఉంటాయి సుమా!

సద్గురుమూర్తి ఆశ్రయం సిద్ధించిన తరువాత బీజము అంకురించి శాఖోపశాఖలై విస్తరించి పరిపక్వస్థితికి చేరుతుంది. సద్గురుమూర్తి బోధను శిష్యుడు శ్రవణం చేసి, మననం చేస్తాడు. శ్రవణం సగుణము. మననము నిర్గుణం. శ్రవణం చేయకుండా మననం చేయలేడు కదా! కాబట్టి సగుణభక్తి, నిర్గుణస్థితికి తీసుకు వెళ్తుంది.

శ్రీకులశేఖరాళ్వారు భగవంతుని ప్రార్థిస్తూ ఎన్ని జన్మలెత్తినా, ఏ ఉపాధితో కూడిన జన్మని ప్రసాదించినా, భగవంతుని దివ్య చరణారవిందముల యందు అచంచల భక్తిని ప్రసాదించమని కోరుకున్నాడు. నిజమైన భక్తుడు కోరుకునే సారూప్యమైనా, సాన్నిధ్యమైనా, సాయుజ్యమైనా సరే ఆనందాన్నివ్వదా?

భగవంతుని తన మనస్సులో నిలుపుకున్నా, లేక తన మనస్సుని భగవంతుని యందు నిలిపినా తేడా ఉందా! అమృతములో మునిగిన వానికి, అమృతము గ్రోలినవానికి తేడా ఉందా! విశ్వరూప సందర్శనము పొందిన అర్జునుడు సగుణభక్తి గొప్పదా? నిర్గుణ భక్తి గొప్పదా? అని అడిగిన ప్రశ్నకు సమాధానంగా శ్రీకృష్ణభగవానుడు 'నిరంతరము ఎవరైతే మనస్సు నాయందే నిలిపి ఉపాసన చేస్తారో వారు గొప్పవారు' అని చెప్పాడు కదా! నిజమైన భక్తుడు సంసారియైనా, సన్యాసి అయినా బ్రహ్మచారి అయినా మనస్సు భగవంతుని దివ్య చరణారవిందాలయందు నిలిపి ఉంచాలి" అన్నారు శ్రీబాబు.

# భగవంతుడిని శీఘ్రంగా ప్రసన్నం చేసుకోవటం ఎలా?

- రమణ ప్రసాద్

భగవంతుడి అనుగ్రహం త్వరగా పొందాలనుకుంటున్నారా? అయితే శ్రీమద్భాగవతం నాల్గవ స్కందం, 31వ అధ్యాయం, 19వ శ్లోకంలో నారదుడు తన శిష్యులకు బోధించిన మూడు సూత్రాలను పాటించండి.

మనం చేసే సాధనలన్నీ ఎందుకు? భగవంతుడిని శీఘ్రంగా పొందడానికేగా! మరి ఆ విధంగా సాధన చేస్తున్నామా? భగవంతుడిని ప్రసన్నం చేసుకోవడానికి ఏ సాధనలు చేయాలి? ఈ విషయాన్నే ఈ శ్లోకంలో శ్రీ నారద మహర్షి వివరిస్తున్నాడు:

భాగవతం చరుర్థ స్కందం; 31వ అధ్యాయం; 19వ శ్లోకం

**దయయా సర్వ భూతేషు, సంతుష్ట్యా ఏన కేనవా।**

**సర్వేంద్రియోఽ పి శాంత్యా చ తుష్యంత్యషు జనార్దన ః॥**

భగవంతుడిని ఎలా ప్రసన్నం చేసుకోవాలో పై శ్లోకంలో మూడు సూత్రాలు చెప్పబడ్డాయి.

**దయయా సర్వభూతేషు -** సర్వ భూతములయందు దయ కలిగి ఉండు;
**సంతుష్ట్యా యేన కేన వా -** భగవంతుడిని సంతుష్టి పరచటానికి మనం ఏమి చేయాలి? భగవంతుడికి ఏది ప్రియమో అది చేయాలి. ఏది చేస్తే తనకు ప్రియమో భగవద్గీత 12వ అధ్యాయం భక్తియోగంలో "సమస్త ప్రాణులందు ద్వేషము లేనివాడు, మైత్రి, కరుణ కలవాడు, అహంకార మమకారములు లేనివాడు, సుఖ దుఃఖములందు సమభావము కలవాడు, ఓర్పు కలవాడు, ఎల్లప్పుడు తృప్తి కలిగి యుండు వాడు, ధృఢ నిశ్చయము కలవాడు, నా యందు సమర్పింపబడిన మనో బుద్ధులు కలవాడు, నా యందు భక్తి కలవాడు నాకు అత్యంత ప్రియుడు" అని చెప్పియున్నాడు.

**ఏన కేన వా -** ఏవిధముగ నైనను "నేను భగవంతునికి తృప్తి కలగించే పనులు చేయాలి" ; ఏ విధంగా భగవంతుని ప్రేమకు పాత్రుడిని కావాలి? అని విచారణ చేయాలి. భగవంతుడు అవ్యక్తుడు కదా! ఆయన తృప్తి చెందినది, లేనిది ఎలా? అనుకోవచ్చు. దీనికి సమాధానం శాస్త్రాలు చెబుతున్నాయి. **"ఈశ్వరో గురురాత్మేతి, మూర్తి భేద విభాగినే"** - "ఈశ్వరుడు,

గురువు, ఆత్మ ఒకటే" అని చెబుతున్నాయి. కాబట్టి నువ్వు సద్గురువుని సమాశ్రయించి ఆయనకు స్థానశుశ్రూష, అంగశుశ్రూష, భావశుశ్రూష, ఆత్మశుశ్రూష అనే నాలుగు విధములైన శుశ్రూషలు చేసి మెప్పించవచ్చును.

**స్థాన శుశ్రూష** - వాక్యార్థము - గురువు జప తపాదులు చేసుకునే ప్రదేశాలను, ఆసనాదులను శుభ్ర పరచటం.

అంతరార్థము - "గురువు సర్వవ్యాపి. ఆయన నా హృదయమునందే స్థితుడై ఉన్నాడు. నా ప్రాణ మనో బుద్ధులు ఎక్కడైతే లయమవుతున్నాయో అదే నా హృదయస్థానము, నా గురుస్థానము. నా గురుస్థానాన్ని పవిత్రముగా ఉంచుకొనుటయే స్థానశుశ్రూష.

**అంగ శుశ్రూష** : వాక్యార్థము - గురువు శరీరమునకు సేవ చేయుట.

అంతరార్థము - "గురువు శరీరము, నా శరీరము వేరు కాదు" అని భావన కలిగి ఉండాలి. అప్పుడు ఈ శరీరంతో చేసే ప్రతి పని గురుపూజ, లేక గురుసేవ అవుతుంది.

**భావ శుశ్రూష**: వాక్యార్థము - గురువు కోరిన దానిని తెచ్చి సమర్పించుట.

అంతరార్థము - ప్రతి గురువు వాంఛించేది తన శిష్యుడు పూర్ణ స్థితిని పొందవలెననియే. "కనుక సచ్ఛిష్యుడైన నేను నా పాత్రను ఏ లోటు రాకుండా పోషించుకోవాలి" అనే భావనతో ఉండటం.

**ఆత్మ శుశ్రూష**: వాక్యార్థము - గురువు తన కోరికను వ్యక్తము చేయకనే ఆయన కోరిక తీర్చి ఆయనకు సంతోషము కలిగించుట.

అంతరార్థము - "అంతరాత్మ అగు నేను, పరమాత్మ అగు గురువు ఒక్కడే" అన్న స్థితి యందు నిలిచి ఉండటమే ఆత్మ శుశ్రూష. నవ విధ భక్తులలో చెప్పబడిన ఆత్మ నివేదనయే ఆత్మ శుశ్రూష.

**సర్వేంద్రియోపి శాంత్యా**ః ఇంద్రియ సంయమనము కలిగియుండి ఇంద్రియములను శాంతి పరచుట. ఈ విషయమునే భగవద్గీతలో,

**శ్రద్ధావాన్ లభతే జ్ఞానం తత్పరస్సంయతేన్ద్రియః।**

**జ్ఞానం లబ్ధ్వా పరాం శాంతిం అచిరేణాధి గచ్ఛతి** - (భగవద్గీత 4/39)

"గురు వాక్యమునందు శ్రద్ధ కలవాడును, ఇంద్రియములను లెస్సగా జయించినవాడును అగు మానవుడు జ్ఞానమును పొందుచున్నాడు. అట్టి జ్ఞానమును పొందినవాడై పరమశాంతిని

పొందుచున్నాడు' అని భగవానుడు బోధించియున్నాడు. ఇంద్రియ సంయమనము చేత జ్ఞానసిద్ధిని పొంది తద్వారా సాధకుడు పరమ శాంతిని పొందుచున్నాడు.

ఈ మూడు సూత్రములను పాటించిన వాడు "**తుష్యంత్యష జనార్దనః**" "జనార్దనుడు" భగవంతుని నామములలో ఒకటి. ఈ పదములో తుష్యతి + అసు - "తుష్యతి" అంటే సంతుష్టి చెందుట; "అసు" అంటే శీఘ్రముగా అని అర్థం.

నారద మహర్షి చెప్పిన ఈ మూడు సూత్రాలను పాటించి భగవంతుడిని సంతృప్తపరిచి తద్వారా భగవంతుని అనుగ్రహాన్ని పొందవచ్చును. ఇది కంఠస్థము చేయతగిన శ్లోకము. దీనిలో చెప్పిన మూడు సూత్రాలను ఆచరించి భగవదనుగ్రహాన్ని అచిరకాలములో పొందవచ్చును.

**పెదనిండ్రకొలను శాఖలో కార్యక్రమాలు**

*** ప్రతి గురువారము అన్నార్తులకు, సాధువులకు అన్నదానం జరుగును***

**అక్టోబర్ 2023**

9 సోమ: శ్రీ గురుదశమి - శ్రీ సద్గురు పాదపూజ

15 ఆది: శ్రీ శరన్నవరాత్రి ప్రారంభం

20 శుక్ర: మూలా నక్షత్రం, సరస్వతీ పూజ

22 ఆది: దుర్గాష్టమి - కుంకుమ పూజ

23 సోమ: మహర్నవమి - కుంకుమ పూజ

24 మంగళ: విజయదశమి - కుంకుమ పూజ

28 శని: ఆశ్వీయుజ పూర్ణిమ - శ్రీ సద్గురు పాదపూజ

**నవంబర్ 2023**

7 మంగళ: శ్రీ గురుదశమి - శ్రీ సద్గురు పాదపూజ

12 ఆది: నరకచతుర్దశి, దీపావళి పండుగ - శ్రీ సద్గురు పాదపూజ

27 సోమ: కార్తీక (గురు)పూర్ణిమ - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

30 గురు: శ్రీ సద్గురుదేవుల పుణ్యారాధన ఉత్సవములు ప్రారంభం

# అహింస

- పాలూరి కాళీప్రసాద్

అక్టోబర్ నెల వచ్చిందంటే ముందుగా గాంధీ జయంతి వస్తుంది. మన ఆధునిక కాలంలో అహింసకు మారుపేరుగా ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చుకొని ఎన్నో దేశాలలో ఎందరికో ఆదర్శంగా నిలిచారు మన జాతిపిత మహాత్మాగాంధీ. అలాగే ఇదే నెలలో అనేకమంది లోకకంటకులైన రాక్షసులను జగన్మాత సంహరించినందుకు గుర్తుగా మనం దసరా వేడుకలను జరుపుకుంటాం.

ఇక్కడే కొందరికి సందేహం కలుగుతుంది. అసలు మనం అహింసను పాటించాలా, లేక అవసరమైనపుడు హింసామార్గాన్ని అవలంబించాలా అని. మనకు ఈ మానవజన్మ లభించడంలో ముఖ్య ఉద్దేశ్యం, ఈ మానవ జన్మకు సార్థకత, మనం మోక్షాన్ని పొందటం. మోక్షాన్ని పొందాలంటే దైవీ సంపదను పెంచుకోవాలని భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్మ బోధించాడు. ఈ దైవీ సంపద అంటే ఏమిటో 16వ అధ్యాయం మొదటి మూడు శ్లోకాలలో వివరించాడు. ఇందులో మొదటి శ్లోకం అభయం (భయం లేకపోవటం)తో మొదలైతే రెండవ శ్లోకం అహింసతో మొదలవుతుంది. అంటే జీవితంలో ప్రతి సమస్యను ధైర్యంగా ఎదుర్కోవడం ఎంత అవసరమో ఆ సమస్యా పరిష్కారంలో ఎవరినీ హింసించకుండా అహింసను పాటించడం కూడా అంతే ముఖ్యం.

ఏ దేశంలో చూసినా యుద్ధంలో ధైర్యంగా పోరాడి శత్రు సైనికులను మట్టుబెట్టిన వీరునికి అనేక సత్కారాలు చేయడం మనం చూస్తూ ఉంటాం. అయితే ఈ సత్కారానికి ప్రాతిపదిక ఆ సైనికుడు తన ప్రాణాలను పణంగా పెట్టి మరీ ఎంత ధైర్యంగా పోరాడాడు అనేదే కానీ ఎంతమందిని చంపాడు అనే లెక్క కాదు. అలాగే యుద్ధంలో శత్రువులను చంపి సత్కారాన్ని పొందిన ఆ సైనికుడే తన వ్యక్తిగత కక్షతో దేశంలో ఎవరినైనా చంపితే అతను శిక్షింపబడతాడు. అంటే రెండు సందర్భాలలోనూ చేసిన పని చంపడమే అయినా దాని వెనుక ఉన్న ఉద్దేశ్యం అది సత్కారార్హమైనదా, లేక శిక్షార్హమైనదా అని నిర్ణయిస్తుంది.

పైన మనం చెప్పుకున్న జగన్మాత చేసిన రాక్షస సంహారాన్ని గమనిస్తే అందులో వ్యక్తిగత కక్షగానీ, స్వార్థం కానీ లేదు. అది కేవలం లోకంలోని ఇతర జీవులను రక్షించడానికి చేసిన సంహారమే. అందులో ముఖ్య ఉద్దేశ్యం రక్షణే కానీ హింస కాదు. "శ్రీకృష్ణుడు భగవద్గీతలో అర్జునుని యుద్ధం చేయమని ప్రోత్సహించాడు కదా, మరి మనం మన శత్రువులను సంహరిస్తే తప్పేమిటి?" అని కొందరు వాదిస్తారు. అయితే ఇక్కడ గమనించాల్సిన ముఖ్య విషయం ఏమిటంటే అర్జునుడు క్షత్రియుడు, పైగా సైనికుడు. అంతకుమించి అతడు యుద్ధరంగంలో నిలిచి ఉన్నవాడు.

అందుకే పరమాత్మ యుద్ధానికి ప్రోత్సహించాడు కానీ అంతకుముందు ఆయన శాంతికి ఎంతగా ప్రయత్నించలేదు? అంతెందుకు స్వయంగా తన భార్యను అపహరించిన రావణునితో కూడా యుద్ధం చేసేముందు శ్రీరాముడు అనేకమార్లు శాంతియత్నాలు చేశాడు. పైగా గీతాచార్యుడు ఎవరి ధర్మాన్ని వారు ఆచరించాలి కానీ, ఎంత గొప్పదైనా పరుల ధర్మం జోలికి పోకూడదని హెచ్చరించాడు. అందువలన యుద్ధం చేయడం, శత్రుసంహారం చేయడం సైనికుల ధర్మమే కానీ మనబోటి వాళ్ళది కాదు. ధర్మరక్షణ కోసం తప్పనిసరి పరిస్థితిలో తమవారితోనే యుద్ధం చేసినా, ఆ తరువాత పాండవులు జీవించినంత కాలం మనశ్శాంతి లేకుండా ఆ బాధలోనే బ్రతికారు.

తమ మతానికో, జాతికో చెందిన ప్రతి వ్యక్తీ ఆయుధాలు సమకూర్చుకొని పరాయి జాతి, మతం వారితో పోరాడటానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చే నాయకులు దాని వలన కలిగే దుష్ప్రభావాలను గమనించడం లేదు. ప్రతివ్యక్తికి సులభంగా ఆయుధాలు దొరికే వ్యవస్థ ఉన్న అమెరికా వంటి దేశాలలో ఆ ఆయుధాలను దుర్వినియోగ పరుస్తూ విచక్షణారహితంగా పసిపిల్లలనుండి వృద్ధులవరకు ఎందరినో కాల్చి చంపుతున్న ఘటనలు మనం తరచుగా వింటూనే ఉన్నాం కదా!

విచ్చలవిడితనానికి నెలవైన ఆటవిక వ్యవస్థను వదలి మనకంటూ ఒక సమాజాన్ని, దానికి కొన్ని కట్టుబాట్లను, వ్యవస్థను ఏర్పరచుకొన్న మానవుడు మళ్ళీ మళ్ళీ ఆ ఆటవిక న్యాయం వైపుకే మొగ్గు చూపడం ఎంతవరకూ సమంజసం? అవతలివారిని హింసించడం ఎంత తేలికో ఆ హింసకు తట్టుకొని ధైర్యంగా నిలబడి, తనకు శక్తి వుండి కూడా ధర్మానికి కట్టుబడి అహింసతో జీవించడం అంత కష్టం. అలా జీవించారు కనుకనే పాండవులు, శ్రీరాముడు మొదలైన వారి చరిత్రలు చిరస్థాయిగా నిలిచిపోయాయి.

అదే అహింసా ధర్మాన్ని ఆధునిక కాలంలో కూడా ఆచరించి చూపి “అసలు ఇలాంటి ఒక వ్యక్తి రక్తమాంసాలతో ఈ భూమి మీద నడయాడాడంటే ముందు తరాలవారు నమ్మలేరు” అని ఐన్‌స్టీన్ మహాశయుడంతటి గొప్ప శాస్త్రవేత్తతో కొనియాడబడిన గాంధీ మహాత్ముని ఆదర్శంగా తీసుకొని మన జీవితాలను తీర్చిదిద్దుకుందాం.

# వాంఛితార్థ ప్రదాయిని

- భాగవతుల హనుమత్ జయప్రద

2022 శ్రీ గురుదేవుల స్వర్ణోత్సవ వేడుకలో అమ్మ ( శ్రీ మాతాజీ) వారు ప్రసాదించిన అనుభవం. మేము దాదాపు 4 సంవత్సరాల తరువాత ఇండియా స్వర్ణోత్సవ వేడుకలకే రావడం. కోవిడ్ కారణాల దృష్ట్యా, నా ఉద్యోగ రీత్యా ఆశ్రమానికి రావడానికి 4 సంవత్సరాలు వీలు పడలేదు. అయినా కూడా అమ్మ రూపంలో ఉన్న శ్రీబాబూజీ మహారాజ్ ఎప్పుడూ ఏ లోటూ రానివ్వలేదు. నిరంతరం రక్షిస్తూ, 'నువ్వేం చేస్తున్నావో గమనిస్తూనే ఉన్నాను' అని గుర్తుచేస్తూ, ఒక్కోసారి చేసే తప్పులకి శిక్షణ ఇస్తూ, మళ్ళీ తామే ఆవేదనని కలిగిస్తూ ఎన్నో అనుభవాలను ప్రసాదించారు, ప్రసాదిస్తున్నారు కూడా.

ఒకసారి నాకు సీతాఫలాలు తినాలని కోరిక కలిగింది. మేము ఉండే జర్మనీలో దొరకవు. దొరికినా కూడా అంత బాగోవు. ఎన్నో సంవత్సరాలు అయింది వాటిని తిని. దొరకవు కాబట్టి ఆ కోరిక తీరలేదు. స్వర్ణోత్సవాలలో మేము కూడా "శ్రీ సద్గురు విశ్వశాంతి పాశుపత వజ్రగ్రథిత మహా మృత్యుంజయ సంపుటిత రుద్రయాగం"లో సేవ చేసుకునే భాగ్యం అమ్మ అనుగ్రహించారు. అది నాలుగవ రోజు. యాగం పూర్తిచేసుకుని సాయంత్రం ఇంటికి రాగానే, అమ్మ ( శ్రీ మాతాజీవారు) రెండు పెద్ద సీతాఫలాలను మా ఇంటికి ప్రసాదంగా పంపించడం జరిగింది. యాగం పూర్తి చేసుకొని ఇంటికి వచ్చిన నాకు, మా వారికీ ఎంతో ఆశ్చర్యం వేసింది. అంతకు మించి తెలియని ఆనందం. ఆ మాహా ప్రసాదానికి మించిన మధురమైన అనుభూతి ఏముంటుంది?

ఫలరూపంలో చూసినట్టు అయితే అవి కేవలం సీతాఫలాలు మాత్రమే. కావాలంటే అమ్మ వేరే ఫలాలను కూడా ప్రసాదంగా ఇవ్వవచ్చు. కానీ అమ్మకి ఎలా తెలిసింది నాకు సీతాఫలాలు మాత్రమే తినాలని వుందని? నేను నా కోరికను ఎవరికీ చెప్పలేదు. కానీ "మనస్సులో వచ్చిన చిన్న సంకల్పం కూడా శ్రీ గురుదేవులకు తెలుస్తుంది!" అని అమ్మ నాకు గుర్తుచేసినట్టుగా అనిపించింది. ఇంకో విషయం ఏమిటి అంటే, ఎన్నో సేవలు, కార్యక్రమాలతో ఆశ్రమం చాలా కోలాహలంగా, గురుసేవకై భక్తులందరూ చాలా నిమగ్నమై ఉన్న సమయం అది. అలాంటి సమయంలో కూడా అమ్మ నా మనస్సులో మెదిలిన సంకల్పాన్ని నెరవేర్చారు.

"అయినా అమ్మకి కాలంతో పని ఏముంది ? మహాత్ములు కాలాన్ని సైతం శాసించగలరు కదా!" ఇది ఇంకా అదృష్టంగా నేను భావిస్తున్నాను. "భుక్తి, ,ముక్తి రెండు అమ్మే ఇవ్వాలి కాదా!"

**అమ్మవై లాలించి , తండ్రివై పాలించి గురువువై దయతోడి మమ్ము దీవించి**

**వాంఛితార్థ ప్రదాయినివై అభయమిచ్చి ఆర్తులను బ్రోవవే శ్రీ సద్గురుమహారాజ్ఞీ!**

# గాయత్రి మంత్రం

సేకరణ - కె. రాఘవరాజు

**ఓమ్ భూర్భువస్సువః తత్సవితు ర్వరేణ్యం**

**భర్గో దేవస్య ధీమహి ధియో యోనః ప్రచోదయాత్**

అని తాతగారి గదిలోనుంచి వినిపిస్తున్న 'గాయత్రీ మంత్రా'న్ని విని వినోద్, వనజా నవ్వుకున్నారు. 'తాతగారికి! చాదస్తం ఎక్కువలా ఉంది. ఇలా రోజూ మూడువేళలా మూడు గంటల సమయం వృధా చేసుకుంటున్నారు. దీని బదులు వాకింగ్ కానీ, మరేదైనా ఎక్సర్‌సైజ్ చేస్తే మేలు కదా!' అన్నాడు వినోద్. వంటగదిలో నుంచి వీరి మాటలు వింటున్న బామ్మ భవాని 'ఏరా! తాతగారిని విమర్శించేంత గొప్పవారా మీరు! మీకేం తెల్సురా గాయత్రీమాత ప్రభావం?' అంది కోపంగా.

'ఏంటర్రా! పిల్లలూ! మీ బామ్మ ఏదో చెప్తున్నట్లుంది? ఏదైనా కథా?' అని అడిగాడు తాత తారకరామయ్య. 'వీరికి కాస్త గాయత్రి గురించి చెప్పండి. 'గాయత్రీ మాత మహత్యం' తెలియక ఏదో అనుకుంటున్నారు. పైకి అనలేదు కానీ వీరి మనసుల్లో 'మంత్రాలకు చింతకాయలు రాలుతాయా?' అనే సందేహం మాత్రం ఉంది' అంటూ బామ్మ వంట గదిలోకి వెళ్ళింది.

తారకరామయ్య తన వాలు కుర్చీలో కూర్చున్నాక, పిల్లలిద్దరూ వెళ్ళి ఆయనకిరువైపులా స్టూల్స్ లాక్కుని కూర్చుని 'తాతగారూ చెప్పరూ! ప్లీజ్!' అని అడిగారు.

ఆయన గొంతు సవరించుకుని చెప్పసాగారు. 'ఇది నిజంగా జరిగిన సంఘటన, కల్పనా కాదు, ఎవరో రాసిన కథా కాదు. యదార్ధ గాథ. అది ఆంగ్లేయులు మన దేశంలో ఉన్నప్పటి విషయం, అప్పటి ఒక ఆంగ్ల దొర - 'థామస్ మన్రో' ఆయన పేరని గుర్తు. క్యాంప్ మీద కన్నడ దేశానికి వచ్చి, ఒకరోజున తన గుఱ్ఱంమీద తుంగభద్రానది ఒడ్డున షికారుకు బయల్దేరాడు. ఆయన తోటి షుమారుగా అరడజను మంది జవాన్లు గుఱ్ఱంతో పాటుగా పక్కనే పరుగెడుతూ అనుసరించసాగారు.

'మన గురించి ఏమనుకుంటున్నారు జనం?' థామస్ తన వెంట వున్నవారిని అడిగాడు. "చాలామంచి వారనుకుంటున్నారు దొరా!" వారిలో ఒక ముఖ్య సేవకుడు, బాపన్న చెప్పాడు. 'మీరంటే అందరికీ భయమే దొరా!' ముఖప్రీతికై మరో జవాన్ చెప్పాడు. 'సరి, సరి. ఈ

రోజు విశేషాలేంటి?' థామస్ మళ్ళీ అడిగాడు.

'ఏమున్నాయ్ దొరా! మీరీ సమయంలో షికారుకు వస్తున్నారు కదా ఈ వారంగా ఒక్కపిట్టా ఈ దారంట రాదు.' 'ఓహ్! అక్కడ చాలామంది జనం ఉన్నారు? ఏంటి విశేషం!' ఆశ్చర్యంగా అడిగాడు థామస్.

'దొరా! అక్కడ నది ఒడ్డున శృంగేరి పీఠాధిపతులు కొలువు చేసి వున్నారు, ఆయన శిష్యులూ, స్వామి వారి ప్రవచనం ఆలకించను ఊరి జనమూ చేరి ఉన్నారు దొరా!' అన్నాడు జవాను.

'శృంగేరీ పీఠమా! అదేంటీ ఎన్నడూ వినలేదే?' అన్నాడు దొర. 'దొరా ! మీరిక్కడికి ఎప్పుడూ రాలేదు కదా! అంచేత విని ఉండరు. ఈ కన్నడదేశంలోని, చిక్క మంగళూరు దగ్గరే శృంగేరి ఉంది. ఆది శంకరాచార్యులు ధర్మ ప్రచారం కోసం మొదటి మఠాన్ని ఇక్కడ శృంగేరీలో స్థాపించారు.'

'శృంగేరి అంటే అర్ధమేంటి ? దానికా పేరు మఠస్థాపన తర్వాత వచ్చిందా? లేక ముందు నుంచే వుందా?' 'శృంగేరి తుంగభద్ర నది ఒడ్డున ఉన్నది దొరా! తుంగభద్ర నది ఇటు ప్రక్కన విద్యాశంకర దేవాలయం, తుంగభద్ర నది అవతల ఒడ్డున నరసింహవనం ఉన్నాయి శృంగేరి అనే పేరు ఋష్యశృంగగిరి నుండి వచ్చిందని అంటారు దొరా! శృంగేరికి సమీపంలో శృంగపర్వతం ఉన్నది. విభాండక మహర్షి కుమారుడు ఋష్యశృంగ మహర్షి. ఈ యోగి మహానుభావుడు. ఒకసారి రోమపాదుడనే రాజు పాలిస్తున్న అంగరాజ్యం క్షామానికి గురై, జనం బాధపడసాగారుట. ఆ సమయంలో, ఋష్యశృంగుడు అడుగు పెట్టగానే వర్షాలు పడి, క్షామ నివారణ అయినదని అంటారు. ఈ గ్రామములో శంకరాచార్యులు అద్వైతాన్ని వ్యాప్తి చేయడానికై స్థాపించినదే ఈ శృంగేరీ శంకరమఠం.' అన్నాడు జవాను.

'ఎంతైనా మీ భారతదేశం చాలా గొప్పదోయ్! మహానుభావులు ఎంతోమంది ధర్మస్థాపనకై కృషి చేసిన పుణ్యభూమి మీది. నాకెంతో ఇష్టం మీ దేశమంటే , నేనిక్కడ పుట్టకపోతినే అని బాధపడుతుంటాను అప్పుడప్పుడు' థామస్ మనస్ఫూర్తిగా అన్నాడు.

- సశేషం

# గురు కృపాహి కేవలమ్

- రమణ ప్రసాద్

“మీరు నన్ను పరమాత్ముడు అని భావిస్తున్నారు కదూ! అటువంటి విశ్వాసం ఉండటం మంచిదే. మీ విశ్వాసం యొక్క శక్తి గొప్పది. అదే మిమ్మల్ని కాపాడుతుంది. నాదేముంది? నేను జగజ్జనని చేతిలో ఒక పనిముట్టుని మాత్రమే.

మీకు ఒక దృష్టాంతం చెబుతాను. మేమంతా అహోబిలం వెళ్ళాము. మాతో ఒక ఇంజనీరు కూడా వచ్చాడు. క్రింద నీటి ప్రవాహం. నేను వద్దని ఎంత చెప్పినా ఆ ఇంజనీరు స్నానానికని కొండ క్రింద ఉన్న నీటి ప్రవాహంలో దూకాడు. అంతే! మళ్ళీ కనిపించలేదు. అక్కడ ఉన్నవారంతా నిస్సహాయంగా కేకలు వేస్తున్నారు. నేను అమ్మని ప్రార్థించి, నా పంచె చెంగును గుండ్రంగా తిప్పి నీటిలోకి విసిరాను. అది నీటిలో మునిగిన ఇంజనీరుగారి శరీరానికి చుట్టుకుపోయి, అంతా కలిసి లాగితే ఒడ్డుకు వచ్చాడు. రక్షణ జరిగింది. మరి నీటిలో మునిగిన వ్యక్తిని కాపాడినది ఎవరు? నా రామ పాదుకల శక్తి వలననే రక్షణ జరిగింది కాని నాదేముంది?” అన్నారు శ్రీబాబు.

“ఇంకొక పర్యాయం ఉత్తరదేశ యాత్ర ముగించుకుని నేనూ, మూర్తీజీ, సంధ్య, విజయ కారులో డెహరాడూన్ నుంచి వస్తున్నాము. మూర్తీజీ కారు నడుపుతున్నారు. సంకీర్తన జరుగుతోంది. మూర్తీజీకి నిద్ర వస్తోంది. అది అస్సాం కొండల ప్రాంతం. అక్కడక్కడ పోలీసు గస్తీ కేంద్రాలు ఉన్నాయి. అది ప్రమాదభరితమైన ప్రాంతం అని మూర్తీజీకి చాలా సార్లు హెచ్చరిక చేశాను. నీకు నిద్ర వస్తే కారు నిలిపివేయి. దొంగల బారి నుండి నేను రక్షించుకుంటాను. ఏమాత్రం భయం లేదు అని చెప్పాను. కానీ మూర్తీజీ ప్రయాణాన్ని అలాగే సాగించాడు.

కారు అకస్మాత్తుగా ఒక బ్రిడ్జి మీద నుంచి 14అడుగుల లోతుకు క్రింద పడిపోయింది. కారు యిసుకలో పడి పక్కకు ఒరిగింది. కారు పడ్డ ప్రాంతంలో నీరు గానీ, రాళ్ళుగానీ లేవు. ఈ జరిగిన ప్రమాదం కొంచెం ముందుగానీ, వెనుకగానీ జరిగి ఉంటే కారులో ఎవరూ రక్షింపబడేవారు కాదు. విజయ చెయ్యి కారు తలుపు క్రింద పడింది. నాకు కాలుకి పెచ్చులు లేచిపోయాయి. చేతివేలు వంకర పోయింది. సంధ్యకి పెద్ద గండం తప్పింది. ఇంత జరిగినా నాకేమీ తెలియదు. నేను ధ్యానంలో ఉన్నాను.

ఇంతలో కళ్ళు తెరచి చూశాను. పరిస్థితి ప్రమాదంగా ఉంది. ఒక్కసారి ‘అమ్మా!’ అని పిలిచాను. అంతే! అక్కడ ఉన్నట్లుగా పోలీసు పరివారం అంతా వెంటనే వచ్చారు. వారు కారును ఎత్తి మమ్మల్ని బయటకు తీశారు.

ఆ జగజ్జనని మమ్మల్ని రక్షించింది. అమ్మ అనుగ్రహం లేకపోతే, ఆ అడవిలో నిర్జన ప్రదేశంలో సహాయం ఎలా దొరుకుతుంది? ఇప్పుడు మీకు చెప్పిన అన్ని సందర్భాలలో సహాయం అందించింది ఎవరు? ‘నేనా?’ నా ద్వారా అమ్మ రక్షించింది. నేను అమ్మ చేతిలో ఒక పరికరాన్ని మాత్రమే” అన్నారు శ్రీబాబు.

# ఆశకు బానిస

- ఆర్.వి. సుబ్రహ్మణ్యం

తను తినడు, ఒకరికి పెట్టడు. కూడబెట్టిన డబ్బునంతా ఇనప్పెట్టెలో బిగించి వుంచి రోజురోజూ చూసి మురిసిపోతూ ఉండే లక్షాధికారి లక్కయ్య. ఇంకా డబ్బు సంపాదించే మార్గం ఎదైనా ఉందా అని ఆలోచన తప్ప వానికి తృప్తిలేదు. ఇనప్పెట్టె తెరిచినప్పుడల్లా 'నాకీ చెర నుంచి విడుదల ఎప్పుడయ్యా' అని మూలుగుతున్న లక్ష్మీదేవి గోడు అతనికి వినబడదు. ఐదు వరహాలు యిస్తానంటే ఆమడ దూరమైనా నడిచి వెడతాడుగాని, ఒక కానీ ఖర్చు పెట్టాలంటే ప్రాణం కొట్టుకుపోతుంది లక్కయ్యకి.

ఇలాగ ధనాశ పెచ్చు పెరిగిపోయిన లక్కయ్యకి ఎవరో ఉపదేశం చేసేసరికి అతడు ధనానికి అధిదేవత అయిన కుబేరుణ్ణి గురించి తపస్సు చేశాడు. తనను గురించి తపస్సు చేసే భక్తుడొకడున్నాడని సంతోషించిన కుబేరుడు త్వరలోనే వానికి ప్రత్యక్షమై 'ఏం కావాలో కోరుకో' మన్నాడు. లక్కయ్య మహదానంద భరితుడై వానికి మ్రొక్కి 'నాకింకా ధనం కావాలి స్వామి. ఈ వరాన్ని ప్రసాదించండి' అని అడిగేసరికి కుబేరుడు అది తన చేతిలోని పనే గనుక వెంటనే ఒక బొమ్మను సృష్టించి లక్కయ్యకు యిచ్చి,"ఇది నీ వడిగినంత ధనం యిస్తుంటుంది. కానీ, దానికి ప్రతిఫలంగా నువ్వు ఏదో ఒకటి ఆ బొమ్మకు యిస్తుండాలి సూమా!" అని చెప్పి మాయమయ్యాడు. లక్కయ్య యింటికి తిరిగి వచ్చిన వెంటనే బొమ్మను పట్టుకుని 'నా కిప్పుడే రెండు గోతాల నిండుగా బంగారు కాసులు కావాలి' అని కోరాడు. తక్షణమే రెండు గోతాలు నిండుగా కాసులతో వాని ముందు ప్రత్యక్షమైనాయి. సంతోషంతో పొంగిపోతున్న లక్కయ్యను 'నాకేమిస్తావు' అంది బొమ్మ. తన యింటికి కాపలాకాసే కుక్కని తీసుకుపొమ్మన్నాడు లక్కయ్య. కుక్క మాయమైంది.

రెండు రోజులు గడిచాక మళ్ళీ బొమ్మని నాలుగు సంచుల నిండా డబ్బు కావాలని అడిగాడు లక్కయ్య. బొమ్మ అలాగే యిచ్చి, తనకేమిస్తావని అడిగింది. అటూ యిటూ చూసి, మంచంలో ఉన్న తన రోగిష్టి తల్లిని తీసుకుపొమ్మన్నాడు. తల్లి మాయమైంది. ఇనప్పెట్టె నిండింది. నాలుగురోజులు తరువాత 8సంచుల నిండా వజ్రాలు అడిగి, ప్రతిఫలంగా ముసలి తండ్రిని మందులిప్పించక్కర్లేకుండా యిచ్చేశాడు. ఇలాగ డబ్బు చేరుతుంటే భోషాణం తెచ్చి దాన్ని నింపసాగాడు. బొమ్మ కోరిన విధంగా తన డబ్బులో వాటా అడుగుతాడని తన తమ్ముణ్ణి, పెళ్ళి చేయాల్సివస్తుందని చెల్లెల్ని తన దురాగడాలకు లబలబలాడిపోతున్న భార్యని, ఇలాగ ఎవరు తనకి నచ్చరో వారందరినీ యిచ్చేస్తూ వచ్చాడు. ధనంతో నిండిన భోషాణంలో యిప్పుడింక పెద్ద గోతాం ధనం పట్టే వెలితి మాత్రమే ఉంది. ఆ ఖాళీని పూరించేంత ధనం యిమ్మని బొమ్మను అడిగాడు లక్కయ్య. 'అయితే నాకేమిస్తావు?' అంది బొమ్మ. "ఆ ధనం నింపితే యింటినిండా డబ్బే ఉందన్న తృప్తి నాకు ఉంటుంది కనుక నన్నే తీసుకో. నాతోపాటు ఆ ధనమంతా తెచ్చుకుని, నీ వెంట వచ్చి అక్కడదంతా అనుభవిస్తాను" అన్నాడు. బొమ్మ పకపకా నవ్వింది. "మూర్ఖుడా! ఆశకి బానిసవై సర్వం పోగొట్టుకున్న నీకు మిగిలిందేమిటి? ఆ డబ్బు కాదు, అది నీవెంటరాదు. మరణానికి సుంకం చెల్లించిన నువ్వు వట్టిచేతులతో కాలగర్భంలో కలిసిపోతున్నావు" బొమ్మ లక్కయ్యతో మాయమైపోయింది. *



దివ్య దర్శనం
ముకుంద్
అయ్యో! కరెంటు పోయిందే! బాబుగారి గదిలో దీపం పెడదాం.
కోటప్పకొండ
1
అయ్యో! దీపం కొండెక్కిపోయింది. ఇంకొకటి తీసుకువద్దాము .
2


అయ్యో! దీపం మళ్ళీ కొండెక్కిపోయింది.
3


ఆ! ఆ కాంతేమిటి, ఏమీ కనపడట్లేదు?!
4


ఈ మూడు కాంతులేమిటి?
5


ఆ మూడు కాంతులు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులుగా మారి బాబుగారిలా అయ్యాయా?
6


అంటే బాబూజీయే
త్రిమూర్తులన్నమాట!
7


ఏంటి హనుమాయమ్మ?
ఎందుకు అంత
ఆనందంగా ఉన్నావు?
మీరే త్రిమూర్తులని నాకు
అర్థమయ్యింది బాబూ! జై
సద్గురు మహరాజ్ కీ జై!
8

# గురోరన్యం న భావయేత్ సేకరణ - మురళీ

**గురోరన్యం న భావయేత్** అంటే అర్థం? తాను ఆశ్రయించిన గురుమూర్తి యందు అచంచల విశ్వాసముతో, భక్తి శ్రద్ధలతో ఆయన ప్రసాదించిన లక్ష్యార్థమును అనుక్షణము స్మరణ చేస్తూ, ధ్యానిస్తూ, గురువాక్య పాలన చేసేవారికి తాము ఆశ్రయించిన గురుమూర్తియే సర్వేశ్వరుడై, సర్వ వ్యాపకుడై, సర్వ రక్షకుడై, సర్వ శక్తిసంపన్నుడై తమను ఉద్ధరించగల సమర్థుడు అనే భావం ఆరూఢమై తమను తాము సర్వ సమర్పణ చేసుకోవడమే.

గురుమూర్తి దగ్గర లక్ష్యార్థం పొందామా? సాధకుడుగా ముందు తన కర్తవ్యం ఏమిటి? జనన మరణ బంధం నుండి విముక్తి కొరకు మనం చేస్తున్న ప్రయత్నం ఏమిటి? దారాపుత్రాదులు, బంధుమిత్రులు బంధవిముక్తిని ప్రసాదించలేరు. దానిని ప్రసాదించ గలిగింది కేవలం గురుమూర్తియే అని గ్రహించాలి. బంధవిముక్తి కలగాలంటే గురువుతో అనుబంధాన్ని పెంచుకోవాలి. ఇది మనం చేసే సాధన వలనే సాధ్యపడుతుంది. సద్గురుమూర్తి ఆశ్రయంలో ఉండాలి. గురుబోధని శ్రద్ధగా వినాలి. విన్న గురుబోధని మననం చేసుకోవాలి. ఇది చాలా ముఖ్యమైన విషయం.

సద్గురుమూర్తిని ఆశ్రయించామా? ఎందుకు ఆశ్రయించాము? సంసార బాధలు పోగొట్టుకొనేందుకా, లేక ముక్తి పొందటానికా? మాయాశక్తి అనుక్షణం జీవుని వెంటాడి బోల్తా కొట్టించాలని చూస్తుంది. దూషణలతో మనసుని క్రుంగదీసి, భూషణలతో పొంగిపోయేటట్లు చేస్తుంది. మాయాప్రభావానికి లోను కాకుండా ఉండాలి. సద్గురుమూర్తి ప్రసాదించిన లక్ష్యార్థమును ఎప్పుడు సాధిస్తామా! నిత్యానందం ఎప్పుడు రుచిచూస్తామా! అనే తీవ్ర ఆవేదన చెందిన సాధకుడు మాయా ప్రభావానికి లోనుకాడు.

సద్గురుమూర్తి యందు సంపూర్ణ విశ్వాసమే భక్తి. పరిపూర్ణ విశ్వాసమంటే గురుమూర్తిని దర్శించగానే వంగి వంగి సలాములు చేయటం కాదు. విశ్వాసమంటే కేవలం గురుమూర్తి బోధ వినటం కాదు, దానిని మననం చేసుకోవాలి. మనస్సు శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలకు అతీతమై సంకల్ప రహితం అయినప్పుడు సద్గురుమూర్తి యందు పరిపూర్ణ విశ్వాసం ఉన్నట్లుగా భావించవచ్చు. ఆ స్థితిని పొందటానికి, అంటే అమనస్క స్థితిని పొందే వరకు సాధన చెయ్యవలసిందే. అమనస్క స్థితి అంటే మనస్సు లేక పోవటం కాదు, మనస్సు సంకల్ప రహితం అవ్వాలి, అంటే వాసనా రహితం అవ్వాలి. ద్వైత దృష్టి తొలగనంత వరకు మనస్సు నిశ్చల స్థితిని పొందజాలదు. అహంకార మమకారాలు, సుఖదు:ఖాలు, రాగద్వేషాలు, ఈర్ష్య అసూయలు అనుభవించినంత

కాలం అమనస్క స్థితి పొందనట్లే సుమా! ద్వైత దృష్టి తొలగిపోగానే మనసు స్థిరపడుతుంది. అదే తితీక్ష. ఆ స్థితిలో సాధకుడు తానెవరో గుర్తిస్తాడు. ఆత్మజ్ఞాన సంపన్నుడౌతాడు.

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

**కార్యక్రమాలలో ఏమైనా మార్పులు వుంటే ఎప్పటికప్పుడు హైదరాబాద్‌శాఖవారి వాట్సప్ గ్రూప్‌లో తెలుపబడును......**

**అక్టోబర్ 2023**

9 సోమ: శ్రీ గురుదశమి - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

22 ఆది: దుర్గాష్టమి - ఉ.11.00 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

23 సోమ: మహర్నవమి - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

24 మంగళ: విజయదశమి - ఉ.11.00 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

28 శని: ఆశ్వీయుజ పూర్ణిమ - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన. చంద్రగ్రహణము స్పర్శకాలం రాత్రి 1.05 గం.లు. మోక్షకాలం రాత్రి 2.22 గం.లు. అశ్వినీ నక్షత్రం, మేషరాశి

**నవంబర్ 2023**

7 మంగళ: శ్రీ గురుదశమి - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

11 శని: నరకచతుర్దశి - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

12 ఆది: దీపావళి - ఉ.11.00 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

17 శుక్ర: నాగుల చవితి - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

23 గురు: చిలుక ఏకాదశి - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

24 శుక్ర: క్షీరాబ్ది ద్వాదశి - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

27 సోమ: కార్తీక (గురు)పూర్ణిమ - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

30 గురు: శ్రీ సద్గురుదేవుల పుణ్యారాధన ఉత్సవములు ప్రారంభం

# నారద భక్తి సూత్రములు

- వారణాసి కాళీ ప్రసాద్ U.S.A

**దుర్లభం త్రయమేవైతత్ దైవానుగ్రహ హేతుకం।**
**మనుష్యత్వం ముముక్షత్వం మహాపురుష సంశ్రయః॥**

ఆదిశంకర భగవత్పాదాచార్యులవారు వివేక చూడామణిలో మనుష్యత్వం, ముముక్షత్వం, మహాపురుష సంశ్రయం ఈ మూడూ దుర్లభమనీ, అవి దొరికినప్పుడు చేయిజార్చుకోరాదని శలవిస్తారు. మరి 84 లక్షల జీవరాశులలో ముక్తిపొందగల ఒకే ఒక్క నరజన్మను ఎత్తిన తరువాత సమర్థ సద్గురుదేవుల పాదము పట్టిన సాధకులకు ముముక్షత్వమును బలపరచుకోవడం ఆవశ్యకము. దానికై ఎన్నో సాధనములు వున్నా వాటిలో భక్తి చాలా ప్రధానమైనదంటూ **మోక్షసాధన సామగ్ర్యాం భక్తిరేవ గరీయసీ** అని శంకరులే వివరించారు.



మరి భక్తి అంటే ఏమిటి? భక్తిని ఎంతో మంది ఎన్నో రకాలుగా నిర్వచించారు. భక్తి అనగానే మనకు ముందు ముఖ్యంగా గుర్తుకు వచ్చేది జగద్గురువులైన గీతాచార్యులు భగవద్గీతలో అందించిన భక్తియోగము. దానిలో ఆయన భక్తి యొక్క లక్షణములను ప్రస్తావిస్తారు. భక్తి గురించి వివరించిన మరొక ప్రముఖమైన గ్రంథము 'నారద భక్తి సూత్రములు'. బ్రహ్మమానస పుత్రులయిన నారదులే స్వయంగా రచించిన ఈ భక్తి సూత్రములలో భాగవత దర్శనమూ, భగవతత్త్వమూ దాగి వున్నాయి.

కొంత లోతుగా పరిశీలిస్తే ప్రేమకు మారుపేరయిన భక్తికి సూత్రములు అవసరమా? అన్న సందేహము కలుగుతుంది. మరి ఆ సూత్రముల యొక్క లక్ష్యమేమిటి? నారదులవారు నిర్వచించిన భక్తి ఎటువంటిది? దాని ఫలమేమిటి? నిరంతర నారాయణ నామ సంకీర్తనలో ఓలలాడే నారదులే సాధికారికంగా, స్వానుభవపూర్వకంగా ఈ సూత్రాలను వివరించడంలో ఆంతర్యమేమిటి? ఈ విషయాలను క్షుణ్ణంగా, శాస్త్రపరంగా పరిశీలించి, వివరించేటంత అనుభవము లేకపోయినప్పటికీ పోతనామాత్యులవారు వివరించినట్లు **విబుధ జనుల వలన విన్నంత, కన్నంత, తెలియ వచ్చినంత తేటపరతు** అన్న విధముగా

శ్రీగురుదేవుల ప్రేరణతో నా ఊహకు అందినంత మేర ప్రస్తావిద్దామన్న చిన్న ప్రయత్నమే **నారద భక్తి సూత్రముల** మీద ఈ వ్యాఖ్యానము.

**భక్తి సూత్రములు** - ముందు వివరించుకున్నట్లు భక్తి అంటే వివిధములైన నిర్వచనములు కనిపిస్తాయి. భక్తి అన్నది 'భజన' అన్న మూలపదం నుండి వెలువడుతుంది. భజన అంటే నోటితో పాడుతూ, కీర్తించడమనే సామాన్య అర్థమే కాక, సేవ, ఆశ్రయించడం అన్న విశేషమైన అర్థాలు వున్నాయి. అంతేకాక, భజనము అంటే భాగము అని కూడా అర్థం. అంటే నేను భగవంతునికి చెందిన భాగము అన్న భావనను కలిగి వుండటమే భక్తి. అందులో 'నీ యది నీకర్పించుట నా విధియే కాదా' అన్న ప్రకారముగా తాను తన గురుపరమాత్మకే స్వంతమని, తనపై తనకు కూడా ఏ హక్కూ లేదని నిజమైన సాధకుడు భావించగలగాలి. సనాతన ధర్మములోని, గురుశిష్య పరంపరలో అటువంటి శిష్యులు అనేకమంది మనకు దర్శనమిస్తారు. **స్వస్వరూపానుసంధానం భక్తిరిత్యభిధీయతే** అంటూ ఆదిశంకరులు ప్రకటించినట్లు సాధకుడు తన స్వస్వరూపముతో అనుసంధానము కలిగివుండాలన్న నిర్వచనము కూడా ఈ భావమునే తెలియజేస్తుంది.

శ్రీమద్భాగవతములో నారదులే నవవిధ భక్తి మార్గములను వివరిస్తూ శ్రవణం, కీర్తనం, స్మరణం, పాదసేవనం, అర్చనం, వందనం, దాస్యం, సఖ్యం, ఆత్మనివేదనం అన్న 9 రకాలుగా సాధకులు భక్తిని ప్రకటిస్తారని తెలియజేస్తారు. శ్రీబాబూజీ మహరాజ్‌వారు ఎంతో సరళంగా, సునాయాసంగా 'అచంచల విశ్వాసమే భక్తి' అని మనందరికి శలవిచ్చారు. ఆ విశ్వాసమును చలించకుండా నిలుపుకోవడం మాత్రం సాధకుని కర్తవ్యమేనని మరువరాదు. అంతేకాక, శ్రీబాబూజీ 'భక్తిలేని జ్ఞానం వికసించద'ని, 'కర్మ, ధ్యాన, జ్ఞాన యోగములన్నిటికీ భక్తి యోగమే మూలమ'ని బోధించారు.

మరి అటువంటి భక్తికి సూత్రములు ఎందుకు? **అల్పాక్షరం విశ్వతోముఖం** అంటూ విశ్వతోముఖమైన బృహత్తర అంశములను అందించ గలిగినదే సూత్రము. ఎంతో గొప్ప అంశములను క్రోడీకరించి అతి చిన్నదిగా సూత్రము ఇవ్వగలుగుతుంది. ఒక మాలలో అనేక పుష్పములకు ఒకే సూత్రము (దారం) ఆధారమైనట్లు ఎన్నో విశేషములకు ఆధారమై ఒక సూత్రం తెలియజేయగలదు.

- సశేషం

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు

**అక్టోబరు 2023**

9 సోమ: శ్రీ గురుదశమి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ
13 శుక్ర: మాసశివరాత్రి
14 శని: అమావాస్య
15 ఆది: శ్రీ శరన్నవరాత్రి ప్రారంభం - ఉ. 8.28 గం.లకు అంకురార్పణ
20 శుక్ర: మూలా నక్షత్రం, సరస్వతీ పూజ - సామూహిక కుంకుమ పూజలు
22 ఆది: దుర్గాష్టమి
23 సోమ: మహర్నవమి
24 మంగళ: విజయదశమి - సామూహిక కుంకుమ పూజలు
25 బుధ: ఏకాదశి - ఏకాహం, దీక్షావిరమణ, శ్రీ సద్గురు పాదపూజ
28 శని: ఆశ్వీయుజ పూర్ణిమ, శ్రీ మాతాజీవారి జన్మదిన మహోత్సవం - శ్రీ సద్గురు మండల దీక్ష ప్రారంభం. శ్రీ సద్గురు పాదపూజ, భక్తసమారాధన. చంద్రగ్రహణము స్పర్శకాలం రాత్రి 1.05 గం.లు. మోక్షకాలం రాత్రి 2.22 గం.లు. అశ్వినీ నక్షత్రం, మేషరాశి

**నవంబర్ 2023**

7 మంగళ: శ్రీ గురుదశమి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ
11 శని: మాసశివరాత్రి
12 ఆది: నరకచతుర్దశి, దీపావళి పండుగ - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్తసమారాధన
13 సోమ: అమావాస్య - అభిషేకములు
14 మంగళ: కార్తీక శుద్ధ పాడ్యమి - ఆకాశదీపం
15 బుధ: నవంబరు 15 నుండి 23 వరకు - శ్రీ రామలింగేశ్వర స్వామి వారికి పంచామృతములు, నవరసములతో ఏకాదశ రుద్రాభిషేకములు, లక్ష బిల్వార్చన
17 శుక్ర: నాగుల చవితి
23 గురు: చిలుక ఏకాదశి - ఏకాహం, శ్రీ సద్గురు పాదపూజ, సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వారి వ్రతములు, భక్త సమారాధన
24 శుక్ర: క్షీరాబ్ది ద్వాదశి - శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన
26 ఆది: జ్వాలాతోరణం - శ్రీ రామలింగేశ్వర స్వామి నగరోత్సవం
27 సోమ: కార్తీక (గురు)పూర్ణిమ - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన
30 గురు: కార్తీక బహుళ తదియ, శ్రీ సద్గురుదేవుల 35వ వార్షిక పుణ్యారాధన (డిశంబరు 7 వరకు) ప్రారంభం - ఉ.9.09 గం.లకు పూజ్య శ్రీ మాతాజీ వారిచే దీక్షా స్వీకరణము. రాత్రి 7.00 గం.లకు శ్రీ సద్గురుదేవుల పుణ్యారాధన

# మనశ్శతకము

(గత సంచిక తరువాయి)

పరశురామపంతుల లింగమూర్తి కవి

(తాత్పర్యము: కుమారి సన్నిధానం కాళీమాత)

**25. అజ్ఞానమాత్మ యనియెడి, ప్రజ్ఞాహీనులకు యుక్తి పాటింపరయా**
**విజ్ఞానపూర్ణరాము న్సుజ్ఞానముతో ముదమున జూడుము మనసా**

తాత్పర్యము: తమ అజ్ఞానమే ఆత్మగా భావించే ప్రజ్ఞాహీనులకు సరియైన తెలివిలేదని తెలిసి సుజ్ఞానముతో పరిపూర్ణ విజ్ఞానుడైనట్టి శ్రీరాముని ఆనందముతో జూడుము మనసా.

**26. అంతయు మాయామయ మని, చింతించుచు నిత్యసుఖము జెందుము సుఖివై**
**యంతయు సచ్చిన్మయ మని, చింతించుచు రామచంద్రు జేరుము మనసా.**

తాత్పర్యము: భౌతికమ్మైనవి అన్నియు మాయయని తెలిసికొని, అంతటయు సచ్చిన్మయ రూపుని గని అతనినే చింతించుచు సుఖముగా నిత్యసుఖమను శ్రీరామచంద్రుని చేరు మనసా.

**27. శబ్దంబులు వినువేళల, శబ్ద శ్రవణముల విడిచి జడమగు నీతో**
**శబ్దార్థము లెఱిగెడి నిశ్శబ్దుని రాఘవుని గనుము శమమున మనసా.**

తాత్పర్యము: సాధనా క్రమములో వినిపించు అనేక శబ్దముల యెడ ఎక్కువ శ్రద్ధ వహించక, శ్రవణ అవయవమును తగినంతనే వినియోగించి నిశ్శబ్దుడైన శ్రీరాముని అంతరంగమున గనుచు శబ్ద అర్థములపై ధ్యాస నిలిపి శమమును పొందు మనసా.

**28. స్పర్శలు గొనువేళల ద్వక్స్పర్శల బ్రకృతిగ దలంచి జడమగు నీతో**
**స్పర్శలు సతతము గొనుని స్పర్శుని రాఘవుని జూడు పాయక మనసా.**

తాత్పర్యము: పతనమునకు హేతువగు ఇంద్రియములలో స్పర్శలు ప్రమాదములని తెలిసికొని ప్రకృతి మాయకు లొంగక అంతరంగమున నిరంతరము శ్రీరాముని స్పర్శతో స్థిర చిత్తుడవై ఉండుము మనసా.

- సశేషం

(గత సంచిక తరువాయి)

# నిరీక్షణ

తమిళ మూలం - శ్రీ ఆర్. సంపత్
తెలుగు అనువాదం - శశికళా దివాకర్

## వినయవంతుడు భరతుడు

పట్టపురాణియైన కౌసల్యాదేవి మందిరమునకు చేర్చబడిన దశరథుడు, తనను మన్నించమని ఆర్తితో ఆమెను కోరాడు. “బాధపడవలదు...వశిష్టులు ఎలాగైనా రాముని అడవులకు వెళ్లకుండా నివారిస్తారు”యని కౌసల్య మహారాజుని అనునయించింది. “లేదు కౌసల్యా! నిన్ను గౌరవించకుండ, పాపాత్మురాలైన ఆ కైకేయిపై నేను పెంచుకున్న వల్లమాలిన మోహం వలన నన్ను నేనే ఈ స్థితికి నెట్టుకున్నాను...ఒకానొక దినమున పుత్రశోకముతో ప్రాణమును వీడిన సలబోజుడనబడు ముని, ‘నీవు కూడా పుత్రశోకముతో మరణిస్తావు’ అని నన్ను శపించాడు. ఆ శాపముయొక్క ఫలితమే నేను ఈ దినమున ఇలా అనుభవిస్తున్నాను” అని బదులిచ్చి ఆ సంఘటనను దశరథుడు కౌసల్యతో ఇలా వివరించాడు...

...యవ్వనముట్టిపడు ప్రాయంలో ఒకమారు ‘గొప్ప విలువిద్యా ప్రావీణ్యుడు’ అని పేరొందిన నేను వేటకై అరణ్యమునకు వెళ్ళాను. మృగములను సంహరించి గర్వించాను. నేనలా వేటాడుచుండు సమయమున నాకు కొంత దూరంనుంచి, కొలనునుండి ఏనుగు నీటిని త్రాగుచున్న శబ్దం వినిపించింది. అది వినిన నేను నా యొక్క ‘శబ్దబేధి’ (శబ్దమును వినిన మాత్రముచేత గురి తప్పకుండ ఆ వైపునకు బాణమును సంధించుట) అంబును సంధించాను. మరుక్షణం “అయ్యో!” అన్న రోదనతో కూడిన గొంతు వినబడింది. వెనువెంటనే నేను అచ్చోటకు వెళ్ళాను. అక్కడ ఒక పసిబాలుడు నా బాణముచే గాయపడి ‘కుట్రచాటు చేయదగు హత్యకు’ గురికాబడిన స్థితిలో వున్నాడు. ఆ బాలుని వెంటనే నా ఒడిలో పడుకొనబెట్టి చికిత్స చేయబూనాను. శ్రావణకుమారుడు అని నామధేయముగల ఆ బాలుడు, “అయ్యా! నేను ఇకపై ప్రాణములతో ఉండబోను. కంటిచూపు లేనటువంటి నా తల్లిదండ్రులు చెంతనున్న ఆశ్రమమందు దాహంతో

పరితపిస్తూ నాకోసం ఎదురు చూస్తుంటారు. దాహం తీరకపోతే వారి ప్రాణాలు పోతాయి. కావున వెంటనే వారికి ఈ కమండలమందలి నీటిని అందజేసి వారి దాహమును తీర్చండి" అని చెప్పి మరణించాడు.

కన్నీరు మున్నీరైన నేను ఆ వయోవృద్ధుల చెంతకు వెడలి వారి దాహార్తిని తీర్చాను. "కుమారా! ఏం మౌనంగా ఉన్నావు?" అని వారు ఆత్రుతతో ప్రశ్నించ, వారితో "ఓ పెద్దాయనా! నేను మీ కుమారుడు శ్రవణుడను కాను... అయోధ్య చక్రవర్తి దశరథుడను. శబ్దభేధి అనబడు అంబును సంధించి ఏనుగు అని తప్పుగ భావించి మీ కుమారుని హత్యచేసాను. తెలియక చేసిన నా ఈ తప్పును దయతో మన్నించి నన్ను మీ కుమారునిగ స్వీకరించవలయును" అని అడిగాను. శ్రవణకుమారుడు మరణించాడను వార్త వినినంతనే వారిరువురూ నోటిని, ఉదరమును తమ చేతులతో కొట్టుకొనుచూ, "కుమారా! మా ఇద్దరి చీకటి బ్రతుకులలో వెలుగువై ప్రకాశించిన నీవు మరణించావా! ఇకపై మేము ప్రాణముతో ఉండియూ ప్రయోజనమేమి? మేము కూడా నీతోనే కలసిపోతాము" అని భీకరంగా రోదించారు. "అయ్యో! మీరు అలా మాటలాడవలదు. నేను మీ ఇద్దరినీ నా అంతఃపురమునకు తీసుకుని వెళ్ళి, నా కళ్ళల్లో పెట్టుకుని చివరిదాకా కాపాడుతాను" అని ఆవేదనతో బదులిచ్చిన నన్నుజూసిన ఆ ముని "నా కుమారునికి యమునిగ వచ్చిన నీవు మమ్ములను కాపాడుటయా!?" యని అంతటి బాధాకరమైన సమయములోను నన్ను హేళనచేసి, "మేము ఎలా పుత్రశోకముతో అంతిమ దశలో ప్రాణములు కోల్పోవుచున్నామో అదే విధముగ నీవునూ వృద్ధాప్యమున పుత్ర శోకముతో మరణించెదవుగాక!" అని శపించి తమ తపోబలముచే స్వర్గలోకమునకు వెళ్ళిపోయారు.

"కౌసల్యా! ఆ శాప కారణంచేతనే పుత్రభాగ్యములేని నాకు కుమారులు కలిగారు. అదే శాప కారణముచేత రాముడు తిరిగి రాడు. పుత్రశోకముతో నేను మరణించుట తథ్యము" అన్నాడు దశరథుడు.

- సశేషం

# ఈశావాస్యోపనిషత్

సేకరణ- కీ.శే. యమ్. జానకిరామ శాస్త్రి

అజ్ఞానం అంధకారం వంటిది. అజ్ఞానం అనే అంధకారం నుంచి బయటపడినవారే యోగులు. ఈ అజ్ఞానం ప్రపంచాన్ని ఆశ్రయించి ఉంటుంది. కేవలం ప్రపంచాన్ని ఆశ్రయించి ఉండేవారు అజ్ఞానంలోనే ఉండిపోతారు. అజ్ఞానంలో ఉండే వారిని గూర్చి ఈశావాస్యోపనిషత్తు తెలియజేస్తోంది.

సత్వం, రజస్సు, తమస్సు అనే ఈ మూడు గుణాలతో కూడుకున్నదే ప్రకృతి. దీనికే అసంభూతి అని పేరు. అసంభూతి అనగా ఉత్పన్నం కానిదని, ఆది లేనిదని అర్థం. ప్రకృతి సహజమైంది కనుక దానిని సహజ ప్రకృతి అంటారు. నిజానికి వేదం ప్రకారం ఆత్మ, పరమాత్మలవలె ప్రకృతి ఉనికి గల జడ పదార్థం. దానిలో మూడు రకాల పరమాణువులు ఉంటాయి. అవి సమస్థాయిలో ఉండడాన్నే “సామ్యావస్థ” అంటారు. ఇంకా ప్రపంచ రూపాన్ని ధరించని అనాది జడపదార్థమే ప్రకృతి. అందుకే దాన్ని అసంభూతి (పుట్టనిది) అని పిలుస్తారు. పరమేశ్వరుడు ఈ ప్రకృతి (అసంభూతి)కంటె భిన్నమైనవాడు. ప్రకృతిలో సత్వరజస్తమో గుణాలున్నాయి, కాని పరమేశ్వరునిలో అవి లేవు. కనుకనే అతన్ని నిర్గుణుడని పిలుస్తారు. త్రిగుణాతీతుడైన పరమేశ్వరుణ్ణి విడిచి ఎవరు త్రిగుణాత్మకమైన జడ ప్రకృతిని ఆశ్రయిస్తారో, లేదా ఉపాసిస్తారో వారు అజ్ఞానం అనే అంధకారంలో ఉంటారు.

ప్రకృతి ఎప్పుడు అట్లాగే ఉండదు. అది పరమేశ్వరుని సామర్థ్యంవల్ల, సాన్నిధ్యం వల్ల ప్రాణి కోటి ఉపయోగార్థమై మహత్వాది రూపంలో పరిణామం చెందుతుంది. ఒకమాటలో చెప్పాలంటే ఈ ప్రపంచ రూపాన్ని ధరిస్తుంది. దీనికే సంభూతి అని పేరు. ప్రకృతి అనేది జడం. అది స్వయంగా పరిణామం చెందదు, సర్వశక్తిమంతుడైన పరమేశ్వరుని కారణంగానే అది ప్రపంచ రూపాన్ని ధరిస్తుంది. ఇది తెలియనివారు అజ్ఞానంలో ఉండిపోతారు, రాగద్వేషాలకు లోనైపోతారు, ప్రపంచ పదార్థాలనే కోరుకుంటారు. ఒక విధంగా పరమాత్మను విడిచి ప్రపంచాన్నే ఆశ్రయిస్తారు. ప్రపంచోపాసకులుగా మిగిలి పోతారు. అటువంటివారే ఇంకా అజ్ఞానమనే పెను చీకటిలో ఉన్నట్లుగా భావించాలని ఈశావాస్యోపనిషత్తు గుర్తు చేస్తుంది.

ఈ జడ జగత్తుకు మూలకారణం చైతన్య స్వరూపుడైన పరమేశ్వరుడు. అతడు ప్రకృతిని ప్రపంచంగా మార్చడంలో స్వతంత్రుడు. ప్రకృతికి స్వయంగా ప్రపంచంగా మారే స్వాతంత్ర్యం లేదు. ఎందుకంటే అది జడం కనుక. పుట్టింది కనుక ప్రపంచాన్ని “సంభూతి” అని, పుట్టలేనిది కనుక ప్రకృతిని “అసంభూతి” అని పిలుస్తారు. కాని ఈ విషయం విద్వాంసులకు తప్ప ఇతరులకు తెలియదు.

విద్యావంతునికి, అవిద్యావంతునికి భేదం స్పష్టంగా కనిపిస్తుంది. విద్యావంతుడు సృష్టికర్త పరమేశ్వరుని ఉపాసించగా, అవిద్యావంతుడు పరమేశ్వరుణ్ణి విడిచిపెట్టి ప్రకృతిని, లేదా ప్రపంచాన్ని ఉపాసిస్తాడు. నిజానికి ప్రపంచం అవిద్యా స్వరూపం కల్గింది. పరమేశ్వరుడు విద్యా రూపధారి. సర్వజ్ఞుడు, సర్వ శక్తిమంతుడు కూడా. జీవునికి బంధం అజ్ఞానం వల్లనే కల్గుతుంది. అజ్ఞానమే అవిద్య. బంధానికి కారణమైన అవిద్యనుంచి బయట పడినవాడే విద్వాంసుడు. అజ్ఞానంతో ఉన్నంత కాలం జీవుని ప్రకృతి, లేదా దాని పరిణామరూపమైన ప్రపంచం బంధిస్తుంది. అందుకే ఈశావాస్యోపనిషత్తు పరమేశ్వరునికి, ప్రకృతికి ఉన్న భేదాన్ని తెలుసుకొని, నడుచుకోమంటుంది. ఎంతకాలం ప్రకృతిని ఉపాసిస్తామో అంతకాలం అజ్ఞానంలో మనం ఉన్నట్లే. ఇంకా చెప్పాలంటే ప్రకృతి ప్రేమికులమై, ఉపాసించటమేగాక, చిత్ర విచిత్ర నామరూప జగత్తుకు ఆకర్షితులమై ఉన్నంతకాలం ఇంకా అంతకంటె ఎక్కువ అజ్ఞానంలో ఉన్నట్లే అవుతుంది.

ప్రపంచానికి ఉపాదాన కారణం "ప్రకృతి" అని, ప్రపంచ నిర్మాణానికి స్వతంత్ర కారణం పరమేశ్వరుడని ఎవరు తెలుసుకుంటారో వారిని అవిద్య అంటుకోదు. వారు అవిద్య(అజ్ఞానం)లో ఎప్పుడూ ఉండరు. లోకంలో ఆయా వస్తువుల విషయంలో తరతమ భేదాలు కనిపిస్తాయి. ప్రకృతి జడం(జ్ఞానం లేనిది). పరమేశ్వరుడు పరమచైతన్యం (అత్యధిక జ్ఞానం) కల్గినవాడు. మనల్ని బంధించేది ప్రపంచమైతే, మనల్ని మోక్షం వైపు నడిపించేవాడు పరమేశ్వరుడే. అందుకే మనం ఎల్లవేళలా పరమేశ్వరుణ్ణే ఉపాసించాలి. ప్రకృతి జీవులను బంధిస్తుందనే విషయం గమనింపదగింది. ప్రకృతి గుణాలు సత్వరజస్తమో గుణాలు. ఈ గుణాలకే త్రాళ్ళని అర్థం. త్రాళ్ళే కదా మనల్ని బంధించేవి. త్రిగుణాత్మకమైన ప్రకృతి మనల్ని బంధిస్తోంది. అట్లే దాని పరిణామ రూపమైన జగత్తు మనల్ని అమితంగా ఆకర్షించి, అజ్ఞానంలో ముంచుతుంది. సృష్టి కర్త పరమేశ్వరుణ్ణి తెలుసుకోకుండా చేస్తుంది.

కర్మవశాన మనం ప్రకృతిచే బంధింపబడుతున్నాము. మళ్ళీ మళ్ళీ శరీరధారులమవుతున్నాం. అనగా జన్మలెత్తుతున్నాం. మరో జన్మ లేకుండా చేసుకోవాలంటే, పుణ్యకర్మలు చేస్తూనే కర్మఫలాలను ఈశ్వరార్పితం చేయాలి. ప్రపంచంలో కారణకార్యరూపం గల వస్తువులను గుర్తించి, వాటికంటె భిన్నమైన పరమేశ్వరుణ్ణి ఉపాసించమని, దానివల్ల మనకు శ్రేయస్సు కల్గుతుందని ఈశావాస్యోపనిషత్తు బోధిస్తుంది.

# అహల్యాబాయి హోల్కరు

-సన్నిధానం కాళీమాత

అహల్యాబాయి హోల్కర్, 31-05-1725 నాడు శంభాజీనగర్ మండలము, చౌండి గ్రామపెద్ద మంకోజీ షిండే దంపతులకు జన్మించింది. 1735 వ సంవత్సరంలో తన పదవ ఏట ప్రముఖ మరాఠా ఉపపాలకుడు (సర్దార్) మల్హారరావు హోల్కర్ ఏకైక కుమారుడు ఖండేరావు హోల్కరుతో అహల్య వివాహం జరిగింది. ఈ సమయంలో ఇందూరు ఉప-పాలకుడిగా మరాఠా ప్రముఖుడు మల్హారరావు వెలుగొందుతున్నాడు. 1754వ సంవత్సరం కుంభేరుకోట ముట్టడి సమయంలో ఖండేరావు మృతిచెందాడు. సతీ సహగమనానికి వుపక్రమించిన అహల్యాబాయిని మల్హారరావు అడ్డుకున్నాడు.

పదేళ్ళకే వివాహమై 29 ఏళ్ళకే వితంతువైన అహల్యకు ఆమె మామగారు అశ్వారోహణము, యుద్ధ నైపుణ్యములూ, వ్యూహములు, పరిపాలనకు సంబంధించిన అన్ని విషయములనూ నేర్పినాడు.

అహల్య ప్రజలశ్రేయస్సు కోసం ఆచారాలను ధిక్కరించి అహర్నిశలూ పాటుపడిన ధీరురాలైన వనిత. ఆమె కట్టించిన కట్టడాలు ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఉన్నాయి.

1766లో కొడుకు, 1767లో మామ చనిపోవడంతో ప్రజల కోరిక ప్రకారం సింహాసనం అధిష్టించినది. 1767వ సంవత్సరం నుండి 1795వ సంవత్సరం వరకు ఆమె ఇందూరు రాజ్యాన్ని పరిపాలించారు. ఆమె రాణి కావడం ఇష్టంలేని మరాఠా ఉపపాలకులు (సుబేదార్లు) తిరుగుబాటు చేయగా చాకచక్యంగా అణిచివేసింది. నర్మదానది ఒడ్డున మహేశ్వరము అనే దృఢమైన రాజధానిని నిర్మించింది. మధ్యభారత మాళవ ప్రాంతాన్ని మహేశ్వరం రాజధానిగా శాంతి సౌభాగ్యాలతో పరిపాలించారు. అప్పటివరకు ఉన్న స్త్రీల "ముసుగు" పద్ధతి నిర్మూలించినది. యుద్ధవిద్యలలో స్త్రీలను ప్రోత్సహించి ఒక మహిళా సేనను ఏర్పరిచారు. వితంతువులకు భర్త ఆస్తి సంక్రమించేలా చేశారు. రాజ్యంలో విద్యాలయాలు స్థాపించి వాటి నిర్వహణకు మాన్యములు ఏర్పాటు చేసింది. చెఱువులు, కాల్వలు త్రవ్వించి వ్యవసాయాభివృద్ధికి బాటలు వేసింది. భారత ప్రసిద్ధిచెందిన మల్లీశ్వరం చీరలు ఈమె కాలంలోనే ప్రారంభించబడింది.

పరిపాలనా సమయంలో ఈయమ్మ సేవకు, దానధర్మాలకు మారుపేరుగా నిలిచారు. ఆమె శివుని భక్తురాలు. మధ్యభారత మాళవ ప్రాంతాంలోనే కాక భారతదేశమంతటా శివాలయాలు నిర్మించారు. తురకల దాడులలో శిథిలమైన అనేక ఆలయాలను పునర్నిర్మించారు. కాశీ, ద్వారక, మథుర, ఉజ్జయిని, రామేశ్వరం, అయోధ్య, హరిద్వారం ఇలా అనేక పుణ్యక్షేత్రాలలోని అలయాలను పునరుద్ధరించారు. 10 జ్యోతిర్లింగములను ఉద్ధరించినారు. ప్రసిద్ధి చెందిన సోమేశ్వర దేవాలయాన్ని పునర్నిర్మించింది.

భారతదేశ చరిత్రలోనే 18వ శతాబ్దంలో అత్యంత శక్తివంతురాలైన పరిపాలకురాలిగా పేరుగాంచిన రాజమాత అహల్యాబాయి హెూల్కర్!! మరాఠాలు పరిపాలించిన మాళవ సామ్రాజ్యపు హెూల్కరు వంశపు మహారాణి.

ఇందూరు విమానాశ్రయానికి దేవి అహల్యాబాయి హెూల్కర్ విమానాశ్రయంగా నామకరణం చేశారు. తెలుగు సాహిత్యంలో అహల్యాబాయి జీవితాన్ని చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు నవలగా మలచగా 1958 నాటి 10వ తరగతి విద్యార్థులకు ఉపవాచకంగా ఆ చారిత్రిక నవలను సంక్షిప్తీకరించారు.

మంచి పరిపాలనా దక్షురాలిగా, సామ్రాజ్య నిర్మాతగా, ఆలయముల నిర్మాతగా, పరమ భక్తురాలిగా స్త్రీశక్తిని దేశం నలుమూలలా చాటిన అహల్యాబాయిగారు ధన్యజీవి!

## శ్రద్ధాంజలి

శ్రీబాబు చిరకాల భక్తులు, ఆశ్రమ నివాసులు అయిన శ్రీ మల్లాది సురేష్ శాస్త్రిగారు 24-9-2023 ఆదివారంనాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 86 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియ జేస్తున్నాము.

# సాధు మహాత్ముల సమాగమం

సేకరణ - నందూ. కె.

ఒకసారి స్వామి దయానంద గిరిజీ మహారాజ్‌వారు జగధారిలో లాలా సేవారాం గారి వద్ద కుటీరంలో ఉన్నారు. ఆ సమయంలో హరిద్వార్‌లోని సాధనా సదన్ మహామండలేశ్వరులు స్వామీ గణేశానందజీ దగ్గరినుంచి ఒక కబురు వచ్చింది. తాను స్వామి దయానంద గిరిజీ మహరాజ్ వారిని కలవాలనుకుంటున్నానని, ఎప్పుడు రమ్మంటారని కబురు పంపారు. అందుకు దయానంద స్వామి "నారాయణ! నిరంతరం సంచారంలో వుండేవాడిని. నన్ను కలవటానికి ఎవరూ ముందుగా అనుమతి తీసుకోవలసిన అవసరం లేదు. ఎవరైనా, ఏ సమయంలోనైనా రావచ్చును. మహామండలేశ్వరులు ఎప్పుడూ పనులతో ఉంటారు, ఖాళీ సమయమే ఉండదు, అటువంటివారిని కలవటానికి ముందుగా అనుమతి కావాలిగాని, నా వంటి వారిని కలవటానికి ఏ అనుమతి అవసరం లేదు. స్వామి వారు ఎప్పుడైన రావచ్చని చెప్పండి" అని సమాధానం యిచ్చారు.

స్వామీ గణేశానందజీ అనేకమంది అనుచరులతో కలిసి పెద్ద వాహనంలో దయానంద స్వామివారి కుటీరానికి విచ్చేశారు. దయానందస్వామివారు సాదరంగా ఆహ్వానించారు. ఇరువురు మహత్ములు కొంత సమయం సత్సంగం జరిపిన తరువాత, గణేశానందజీ మహరాజ్ తమతో తీసుకువచ్చిన పండ్లు ఫలహారాలు వచ్చిన సాధువులకు, అక్కడున్న ఇతరులు అందరికీ ప్రసాద వితరణ చేశారు. సాధువులందరూ పంక్తిలో కూర్చున్నారు. దయానంద స్వామిని కూడ తమతో పాటు ప్రసాదం తీసుకోమని అర్థించారు. అంతట దయానందస్వామి కుటీరంలో వ్రేలాడుతున్న తన భిక్షాపాత్రను (కొబ్బరి చిప్ప) తెచ్చుకున్నారు. అందులో అప్పటికే భిక్ష ఉన్నది. దయానంద స్వామి తాను యాచించిన భిక్ష మాత్రమే తీసుకుంటానని, అది తనకు సరిపోతుందని చెప్పారు. గణేశానంద స్వామి అభ్యర్థన మేరకు ఒక చెంచాడు కూర, చిన్న చపాతీ ముక్క చిన్న పండు ముక్క మాత్రం తీసుకున్నారు.

భక్తుల ప్రసాద స్వీకరణానంతరం, మహత్ములు యిద్దరూ ఏకాంతముగా కొంత సేపు ఆధ్యాత్మిక చర్చ జరిపారు. తరువాత స్వామీ గణేశానంద దయానంద స్వామి వద్ద శలవు తీసుకుని తన శిష్యులతో కలిసి వెళ్ళారు. ఈ యిద్దరు మహాత్ములు చిన్నప్పటి సహాధ్యాయులు, స్నేహితులు కూడా. ఈ సన్నివేశంలో దయానంద స్వామి యొక్క విశిష్టమైన నిరాడంబరత, దైహిక సుఖాల పట్ల విముఖత, అత్యంత సాధారణమైన జీవన విధానం మనకు గోచరిస్తాయి.

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

## శ్రీ మావులేటి ఈశ్వరరాజుగారితో శ్రీబాబు

(గత సంచిక తరువాయి) - కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

ఈశ్వరరాజుగారు నసుగుతూ "మనతో వచ్చిన భక్తుల కోసమే యిది చేయించాను బాబూ! గుడి దగ్గర అందరికీ పెట్టడానికి యిది చాలదు'' అన్నారు. "భక్తులకు వినియోగ పరుస్తానని మాట అన్నావు. ఇక్కడ మన భక్తులే భక్తులా? ఇతరులు భక్తులు కారా? వెళ్ళి గుడి దగ్గర అందరికీ పెట్టు. హృదయం నిండా ప్రేమను నింపుకొని ఒకొక్కరికి దోసిలి నిండా పెట్టు'' అన్నారు. ఈశ్వరరాజుగారు "ఈ కొంచెము, అందరికి..'' అంటుంటే శ్రీ బాబు "భగవంతుని ప్రసాదము కొంచెం ఎప్పుడూ కాదు. కొంచెమైన నీ మనస్సును యింకా కుంచించుకు పోనీయకుండా విశాలపరచుకుని పెట్టు. అందరికీ సరిపోతుందిలే. భయపడకు'' అని పంపించారు. వారు వెళ్ళగానే శ్రీ బాబు తారకంగారిని పిలిచి "నువ్వు కూడా ప్రక్కనే ఉండి బాగా దోసిలి నిండా పెట్టించు'' అని పంపారు.



ఈశ్వరరాజుగారు, తారకంగారు సద్గురు స్మరణ చేసుకుంటూ, గురుదేవులపైనే సర్వ భారమును ఉంచి, స్వామి చెప్పినట్లు చేశారు. గుడి వద్ద నిలబడి, యాత్రికులంతా దర్శనం చేసుకుని వెళ్ళిపోయే వరకు, ఆలయ ప్రాంగణం నిర్జనమయ్యే వరకు ఉండి ప్రతి ఒక్కరికి దోసిలి నిండా, నిండారిన విశ్వాసంతో ప్రసాదం పంచిపెట్టారు. చివరకు మిగిలిన ప్రసాదం తెచ్చి, సత్రంలో అందరికి అలాగే దోసిలి నిండా పెట్టారు. అందరికి సమృద్ధిగా సరిపోయిన తరువాత, వారిరువురి దోసిలి నిండా కూడా శ్రీ బాబు ప్రసాదం పెట్టారు. అప్పటికి పాత్రలో చిటికెడు పులిహోర మిగిలింది. శ్రీ బాబు అది తాము స్వీకరించి **"పూర్ణమద: పూర్ణమిదం..''** అంటూ ఆ పాత్రను అందరి చుట్టూ త్రిప్పి పూర్ణపాత్రను చేశారు. "భగవానుని ప్రసాదం ఎప్పుడూ పూర్ణంగానే ఉంటుంది. ఎందరు పూర్ణంగా అనుభవించినా అది పూర్ణంగానే ఉంటుంది'' అన్నారు.

ఆశ్రమ నిర్మాణానంతరము ఈశ్వరరాజు దంపతులు అన్ని విశేష కార్యక్రమాలకు వచ్చి వెడుతూ ఉండేవారు. చిరంజీవి రాజుగారి తల్లి శేషమాంబగారు 1980లో శ్రీ గురుసాయుజ్యం పొందినప్పుడు ఈశ్వర రాజుగారు సకుటుంబంగా ఆశ్రమానికి వచ్చి పన్నెండవ రోజు రాత్రి గుండుగొలను బయల్దేరి వెళ్ళారు. మరునాడు ఏకాదశి. ఉదయమే కాకినాడ బయల్దేరి వెడుతూ రాజమండ్రి బస్‌స్టాండులో అతి అనాయాసంగా శ్రీ సద్గురు సాయుజ్యం పొందారు. ఆ సమయానికి వెంట ఎవరూ లేరు. రాజమండ్రిలో శ్రీ బాబు భక్తులు కృష్ణమ్మగారు (లేబరు ఆఫీసరుగారు) ఈశ్వరరాజుగారి ఆత్మీయ మిత్రులు సమయానికి వెళ్ళి సహాయపడ్డారు.

ఆ మరునాడు కృష్ణమ్మగారు శ్రీ బాబు దర్శనానికి వెళ్ళగా, శ్రీ బాబు "ఏమండీ కృష్ణమ్మగారూ! మీ మిత్రుని సాగనంపి వచ్చారా? విధి విలాసమెంత విచిత్రమో గమనించారా? ఆ ముందురోజు రాత్రి ఒంటి గంట వరకు ఈశ్వర రాజుగారు యిక్కడే ఆశ్రమంలోనే ఉన్నారు. మరునాడు మధ్యాహ్నం ఒంటిగంటకు రాజమండ్రి బస్ స్టాండులో ఆయన తనువు చాలించారు. అందుకే **'ఊరనో, అడవినో, ఉదక మధ్యముననో, ఎక్కడో విడుచుట యే క్షణంబో। మరణమే నిశ్చయము। బుద్ధిమంతుడైన, దేహమున్నంతలో నిన్ను తెలియవలయు'** అని మహాత్ములు చెప్పారు" అన్నారు.

ఆ తరువాత సుశీలమ్మగారిని శ్రీబాబు ఆశ్రమానికే పిలిపించుకున్నారు. శ్రీ రామలింగేశ్వర స్వామివారి ఆలయంలో ఆమెకు సేవా భాగ్యాన్ని కల్పించారు. ఆ పరమేశ్వరుని సేవలోను, గురు సేవలోను ఆశ్రమ సేవలోను, భక్తుల సేవలోను తమ శేషజీవితాన్ని చరితార్థం చేసుకుని, సుశీలమ్మగారు శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలలో విజయదశమి నాటి సుప్రభాత ఘడియలో శ్రీ సద్గురు సాయుజ్యం పొందారు. వారివురు **"అనాయాసేన మరణం। వినా దైన్యేన జీవితం । దేహాంతే తవ సాయుజ్యం । దేహిమే పరమేశ్వర॥"** అని చేసుకున్న ప్రార్థనను శ్రీ బాబు అలా సఫలం చేశారు.

# విష్ణు  కథలు

(గత సంచిక తరువాయి)

-రమణ ప్రసాద్

## సమర్థ రామదాసు

“త్రిలోకాలు ఎవరి కీర్తిని కొనియాడుతున్నాయో, అట్టి సమర్థులైన సద్గురువు యొక్క అండదండలు గల శిష్యుడిని వక్రబుద్ధితో గాని, చిన్న చూపుతోగాని చూసే దమ్ములు ముల్లోకాలలో ఎవరికి కలవు?” అని దీని అర్థం అని చెప్పాడు మధుకర్.

ఆయన మధుకర్ మొహంలోకి అదోలా చూస్తూ లోపలికి పిలిచారు. అతని ముఖకవళికలను చూసి “నీ జన్మ తిథి ఏమిటి?” అనడిగారు. మధుకర్ చెప్పాడు. జోషి గారు లెక్కలు వేసి “చూడు బాబూ! నీకు చెప్పకూడదు గాని నువ్వు రేపు ఇదే సమయానికి మరణిస్తావు. రేపు మధ్యాహ్నానికి నీ మృత్యువు నిశ్చితం. నిన్ను మృత్యుముఖంలో నుండి మీ సమర్థుడు ఉన్నాడే, ఆయన ఎవరో విడిపిస్తే ఎల్లుండి రా. అప్పుడు వేస్తాను మధుకరి” అన్నాడు. ఆ మాట వినగానే మధుకర్ నిలువెల్లా భయంతో వణికిపోతూ గుడికి చేరాడు.

మధుకర్ సమర్థుల మోకాళ్ళలో తల పెట్టి ఏడ్వసాగాడు. సమర్థులు “ఎవరైనా ఏమైనా అన్నారా? ఎవరైనా కొట్టారా?” అని అడిగారు లాలనగా. “నాకు చావు ఆసన్నమైంది. రేపు ఈ సమయానికి నేను చచ్చిపోవడం ఖాయం. నాకు చావంటే భయం. ఈ విషయం లెక్క కట్టి జోషీగారు చెప్పారు” అన్నాడు. మధుకర్ వళ్ళు జ్వరంతో కాలిపోతోంది. అతను పలవరిస్తూ “అరుగో యమదూతలు! నేను రాను! నేను రాను! అని అరుస్తున్నాడు. తెల్లవారింది. మధుకర్‌కి జ్వరంగా ఉన్నా స్నానం చేయించి బట్టలు మార్చి కాస్త ఖిచిడీ తినిపించారు సమర్థులు.

“మధుకర్! కాసేపు పడుకుంటాను. రాత్రంతా నా ప్రాణాలు తోడేశావు” అన్నారు సమర్థులు. “అదేమిటి స్వామీ నేను ఇంకొక గంటకన్నా ఎక్కువ బ్రతకను” అన్నాడు మధుకర్. “నువ్వు నా కాళ్ళు పడుతూ ఇక్కడే ఉండు. ఎవరు పిలిచినా వెళ్ళకు” అని నిద్రకు ఉపక్రమించారు.

ఇంతలో గది వద్ద అలికిడి అయింది. పదిమంది యమభటులు మధుకర్‌ను “బయటకురా!” అన్నారు. “నేను రాను” అన్నాడు మధుకర్. “మర్యాదగా రా” అన్నారు యమభటులు. “నేను గురుసేవ చేస్తున్నాను” అన్నాడు. యమభటులు కోపంగా పాశం విసిరారు. అది సమర్థుల గొంగళి దాకా కూడా వెళ్ళలేక

పోయింది. ఎన్ని ప్రయత్నాలు చేసినా లాభం లేకపోయింది. "ఇక యముడే రావాలి" అనుకొంటూ వెళ్ళిపోయారు. ఇది సమర్థుల పాద మహిమ అని గ్రహించి ఆయన పాదాలను వదలకుండా పట్టుకునే వున్నాడు మధుకర్. ఇంతలో ఒక పెద్ద ఆకారం దున్నపోతు ఎక్కివచ్చి కర్కశంగా "ఏయ్ పద!" అన్నాడు. "నేను రాను" అన్నాడు మధుకర్. యముడు పాశం వేశాడు. అది సమర్థుల తలపైపు వున్న గొంగళిదాకా వచ్చి ఆగిపోయింది. హతాశుడై యముడు వెనుదిరిగాడు.

సమర్థులు ఒళ్ళు విరుచుకుంటూ నిద్ర లేచారు. "నువ్వు ఇంకా బ్రతికే ఉన్నావా?" అన్నారు. "స్వామీ! నన్ను ఈ పాదాలే రక్షించాయి. ఆహా ఇంత మహత్మ్యం ఉందా? మీ పాదాలలో" అని ఆశ్చర్యపోయాడు.

రెండవ రోజు "చూడు మధుకర్! నువ్వు ఆ జ్యోతిష్కుడైన జోషీ ఇంటికి వెళ్ళి మధుకరి అడుగు" అన్నారు. జోషీ బువా ఇంటి ముందుకు వెళ్ళి "సమర్థాచియా... దాసాభిమాని" అని చదివాడు. జోషీ బయటకు వచ్చి "నువ్వు ఇంకా బ్రతికే ఉన్నావా?" అన్నారు. ఆయన మళ్ళీ లెక్కలు వేశారు. ఆయన లెక్కలో తప్పు లేదు అనుకున్నాడు. మధుకర్ జరిగిందంతా చెప్పాడు.

"మీ సమర్థులు చాలా సమర్థులులాగా ఉన్నారే ఆయన దర్శనం చేసుకోవచ్చా?" అన్నాడు జోషీ. "రండి వెడదాం" అని ఇద్దరూ మారుతి గుడికి వెళ్ళారు. సమర్థులు "మీ జ్యోతిష్యం చెప్పే పని బాగా సాగుతోంది అన్నమాట" అన్నారు. "ఏదో వినోదం కోసం చెప్తుంటాను" అన్నాడు జోషి. "భలే! వినోదం కోసం మరణ సమయం చెప్పి వాళ్ళు భయంతో, దుఃఖంతో కృశించిపోతుంటే అది చూసి ఆనందించడమా మీ వృత్తి? ఇదేనా జ్యోతిష్యశాస్త్ర ఉద్దేశ్యం?" అన్నారు. జోషీ ఏమీ మాట్లాడలేదు. "మీరు జరిగినది చెప్పి మిగిలిన కాలం భగవత్సేవలో గడపమని చెప్పాలి. అంతేగాని 'ఈ సమయానికే చస్తావు' అని చెప్పి శాస్త్రాన్నే అవమానిస్తున్నారు. ఇదే కృషి మీరు రామనామం జపించటంలో చేసి ఉంటే మీకు సర్వోత్తమగతి కలిగేది" అన్నారు. జ్యోతిష్కుడు సమర్థుల కాళ్ళపై పడ్డాడు. జోషీకి రామనామ దీక్ష ఇచ్చి రామనామ ప్రచారం చేయమని ఆజ్ఞాపించారు. మధుకర్‌ని "ఇక నువ్వు ఇంటికి వెళ్ళు నేను మీ ఊరుకు వచ్చి రామాలయం స్థాపిస్తాను. రామనామం చేసుకొంటూ రామ దర్శనం పొందగలవు" అన్నారు.

- సశేషం

# శ్రీ కాళీ వనాశ్రమ శాఖ, భీమవరము, పశ్చిమ గోదావరి జిల్లా (ఆం.ప్ర)

**భవన నిర్మాణము**

సమర్థ సద్గురుదేవులు శ్రీ హనుమత్కాళీ వర ప్రసాద బాబూజీ మహరాజ్ వారు లోక కళ్యాణం కొరకై ఎన్నో చోట్లకు వెళ్ళి ఎందరో భక్తుల ఆర్తిని బాపిన అవతార పురుషులు. వారు నడయాడిన ఊరు భీమవరము మరియు ఆ చుట్టు ప్రక్కలనున్న యనమదుర్రు, దిరుసుమర్రు మొదలగు గ్రామములు. శ్రీ స్వామివారు మహా ప్రస్థానం పొంది 35 సంవత్సరములు అయినవి. ఇచ్చటి భక్తులందరూ చేరి భీమవరం-ఉండి రోడ్డున దాతలు ఇచ్చిన స్థలములో బృందావనము, దాని ప్రక్కన అన్నదాన శాల, వసతి గృహము నిర్మింప సంకల్పించినారు. ఈ భవన శంకుస్థాపన శ్రీ కాళీవనాశ్రమ పీఠాధిపతి యోగిని శ్రీచంద్ర కాళీ ప్రసాద మాతాజీవారు, ది.10-05-2023 తెల్లవారు జామున 3.24 గం.లకు చేశారు.

ఈ సందర్భమున భక్తులకు చేయు విన్నపమేమనగా, మీరెల్లరూ ఉదార స్వభావముతో ముందుకు వచ్చి త్వరలో ఈ భవన నిర్మాణము పూర్తియగునట్లు తమ సహాయ సహకారములను ధన రూపేణ, వస్తు రూపేణ అందించమని ప్రార్థించుచున్నాము.

విరాళములు ఈ క్రింది బ్యాంక్‌కు పంపవలెను.
Sri Sri Sri Hanumat Kali Vara Prasad Babu Trust
Bank of Baroda, Nambur Branch
S/B Account No : 69900 1000 00 172
IFSC : BARB0DBUNAM (5th character is 'zero')
Contact Numbers
Murali : 93983 34345
Tummalapalli Siva : 96181 99556

**భక్తులు ఒసగు విరాళములకు ఐ.టి యాక్ట్ 80జి క్రింద పన్ను రాయితీ లభించును.**

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD

# శ్రీ మాతాజీ వారి ఐరోపా పర్యటన దృశ్యములు



బ్రాక్‌నీల్‌లో శ్రీ తేజ, ఫణి గారి గృహమున



ఎయిల్స్‌బరిలో శ్రీ ఆదిత్య గారి గృహమున



లీడ్స్‌లో శ్రీ శ్రీనివాస్, భవాని గారి గృహమున



లీడ్స్‌లో శ్రీ నగేష్, పద్మావతి గారి గృహమున

REGD. NEWS MAGAZINE PERIODICAL
Posted on 5th and 6th of every month.

RNI No.: 37804/1981
Postal Regd. No. : GTR/27/2021-2023

## శ్రీ మాతాజీ వారిచే లీడ్స్ హిందూ టెంపుల్ నందు నిర్వహించిన సామూహిక కుంకుమ పూజలు మరియు సత్యనారాయణ వ్రతముల దృశ్యములు



సత్సంగము



సామూహిక పూజలు



ఐరోపా బాబా భక్త సమాజ్ సభ్యులు

If undelivered please return to
SAMARDHA SADGURU
Sri Kali Gardens Ashramam - 522 508, A.P.